ప్రజాశక్తి

శనివారం 18 మే 2024 8 పేజీలు





ప్రకాశం బాపట్ల



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, ఎస్‌పి

చీరాల వచ్చిన గవర్నర్ అబ్దుల్‌నజీర్

స్వాగతం పలికిన కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి-చీరాల

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ శుక్రవారం వ్యక్తిగత పర్యటన నిమిత్తం వాడరేవు ఐటిసి గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్‌జిందాల్ గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు పోలీసులు గౌరవ వందనం చేసి.. ఘన స్వాగతం పలికారు.

స్ట్రాంగ్ రూంల వద్ద

అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

3లో

గెలుపుపై అభ్యర్థుల ధీమా.!



- ఈవీఎంలలో నేతల రాజకీయ భవిష్యత్
- మెజారిటీలపై ఆయా పార్టీల శ్రేణుల అంచనాలు.!

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పర్వం ముగిసింది. అభ్యర్థుల రాజకీయ భవిష్యత్ ఈవీఎంలలో నిక్షిప్తమై ఉంది. జిల్లాలో ఉన్న ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు, బాపట్ల పార్లమెంట్ నుంచి ఏ పార్టీ అభ్యర్థులు గెలుపొందుతారు అనే విషయమై ఉత్కంఠ కొనసాగుతోంది. ఓట్ల లెక్కింపు వచ్చే నెల 4న జరుగనున్న క్రమంలో గెలుపుపై ఎవరికి వారు ధీమాగానే ఉన్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో ప్రస్తుతం బాపట్ల జిల్లాలో ఉన్న ఆరు నియోజకవర్గాల్లో అద్దంకి, పర్చూరు, చీరాల, రేపల్లెల్లో టిడిపి అభ్యర్థులు గెలుపొందారు. బాపట్ల, వేమూరు నుంచి వైసిపి అభ్యర్థులు విజయం సాధించారు. చీరాల నుంచి టిడిపి తరపున గెలిచిన కరణం బలరామకృష్ణమూర్తి ఆ తరువాత వైసిపికి మద్దతు ఇచ్చారు.

ఐదేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో అప్పట్లో వైసిపికి రాష్ట్రవ్యాప్తంగా అనుకూల పవనాలు వీచిన నేపథ్యంలో కూడా బాపట్ల జిల్లాలో నాలుగు స్థానాల్లో టిడిపి అభ్యర్థులు గెలుపొందారు. ఈ ఎన్నికల్లో కూడా అద్దంకి, పర్చూరు, రేపల్లె నుంచి టిడిపి తరపున సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న గొట్టిపాటి రవికుమార్, ఏలూరి సాంబశివరావు, అనగాని సత్యప్రసాద్ ఎన్నికల బరిలో నిలిచారు. వీరు దశాబ్దకాలంపైగా నియోజకవర్గ ప్రజలతో కలిసిపోయారు. విస్తృతమైన పరిచయాలు న్నాయి. ఈ మూడు చోట్ల టిడిపి అభ్యర్థుల గెలుపు ఖాయమని ఆ పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఈ మూడు నియోజక వర్గాల్లో వైసిపి అధిష్టానం ఎన్నికలకు ముందు అప్పటి వరకు తమ పార్టీ ఇన్‌ఛార్జీగా ఉండి ఎన్నికల్లో పోటీ చేయాల్సిన వారిని మార్చి కొత్త వారిని వైసిపి అభ్యర్థులుగా ప్రకటించారు. అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల నుంచి వైసిపి తరపున పోటీ చేసిన పాణెం హనిమి రెడ్డి, యడం బాలాజీలు నియోజకవర్గాలకు పూర్తిగా కొత్త. రేపల్లె నుంచి వైసిపి తరపున పోటీ చేసిన ఈపూరు గణేష్ స్థానికుడే గానీ దశాబ్దకాలం పైగా రాజకీయాల్లో లేరు. దీంతో వీరు స్థానిక నేతలపై ఆధారపడాల్సి వచ్చింది. వైసిపిలో ఉన్న గ్రూపు రాజకీయాల కారణంగా అందరినీ కలుపుకుని వెళ్లారు. వైసిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో పాటు ప్రజల్లో సిఎం జగన్‌పై ఉన్న అభిమానం తమ గెలుపునకు తోడ్పడుతుందనే నమ్మకంతో వారున్నారు. వేమూరు అసెంబ్లీ స్థానం నుంచి కూడా వైసిపి అభ్యర్థి మార్పు జరిగింది. వేమూరు నుంచి గత ఎన్నికల్లో గెలిచి మంత్రి గా ఉన్న మేరుగ నాగార్జునను అక్కడి నుంచి తప్పించి కొండపి వైసిపి ఇన్‌ఛార్జీగా ఉన్న వరి కూటి అశోక్‌బాబును వేమూరు నుంచి ఎన్నికల బరిలో నిలిపారు. వేమూరుకు అశోక్‌బాబు పూర్తిగా కొత్త అయినప్పటికీ విస్తృతంగా ఓటర్లను కలిశారు. వైసిపి శ్రేణులను కలుపుకుని వెళుతూ ఇక్కడ టిడిపి తరపున ఎన్నికల బరిలో నిలచిన మాజీ మంత్రి నక్కా ఆనందబాబుకు గట్టిపోటీ ఇచ్చారు. బాపట్ల నుంచి వైసిపి తరపున ఎమ్మెల్యేగా గెలిచిన కోన రఘుపతి మూడో సారి వైసిపి తరపున ఎన్నికల బరిలో నిలవగా టిడిపి తరపున వేగేశన నరేంద్ర వర్మ మొదటిసారి పోటీ చేశారు. బాపట్లలో కోన 2లో

చాప కింద నీరులా కుష్టు

జిల్లావ్యాప్తంగా

1400 మంది వ్యాధిగ్రస్తులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జిల్లాలో కుష్టు వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రతినెల 360 కేసులు దాకా నమోదవు తున్నాయి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 1400 మంది కుష్టు వ్యాధిగ్రస్తులు చికిత్సలు పొందుతున్నారు. కరోనా ప్రభావంతో మూడేళ్లు పాటు జిల్లాలో కుష్టువ్యాధిపై సర్వేలు సక్రమంగా జరగలేదు. దీంతో ఒక్కసారిగా బాధితుల సంఖ్య పెరిగేందుకు అవకాశాలు ఏర్పడ్డాయి. చాలా మంది కుష్టు వ్యాధిగ్రస్తులు అంగవైకల్యంతో బాధపడుతున్నారు.



వ్యాధిగ్రస్తులకు మందులు అందజేస్తున్న వైద్యాధికారులు (ఫైల్)

సర్వేతో సరి..పించన్లేవీ.?

వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఏటా రెండుసార్లు సర్వే చేస్తారు. ఇంటింటా సర్వేచేసే సమయంలో కుటుంబ సభ్యులు ఆరోగ్యశాఖ సిబ్బందికి సహకరించాలి. ఎటువంటి మచ్చలున్నా సిబ్బందికి చూపిస్తే అనుమానాస్పద కేసులను వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల దృష్టికి సిబ్బంది తీసుకెళతారు. మళ్లీ పరీక్షలు చేసేందుకు ప్రత్యేక వైద్య బందం అనుమానాస్పద కేసులున్న చోటకు వెళతుంది. గతంలో స్పర్శలేని మచ్చలు ఉంటే ఆనుప త్రులకు వెళ్లాలనే నినాదం ఉండేది. ఇప్పుడు చర్మంపై ఎలాంటి మార్పులు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలని వైద్యారోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రారంభంలోనే నివారించేలా ఆ శాఖ పని చేస్తోంది. ముఖ్యంగా పశ్చిమ ప్రకాశంలో ఈ కేసులు అధికంగా ప్రబలుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న కుష్టు వ్యాధిగ్రస్తుల్లో సుమారు 300 మందికి పైబడి ఫించన్లు రావడం లేదు. వీరికి కూడా 45 శాతం అంగవైకల్యం దాటితేనే పింఛనుకు అర్హులుగా చేయడంతో కాళ్లు, చేతులు తిమ్మర్లు, పుండ్లతో బాధపడుతున్నారు.

పరికరాల సరఫరాకు నిధుల కొరత..

మైక్రో బ్యాక్టీరియా లెప్రె ద్వారా ఇది సోకుతోంది. చికిత్స పొందని వారి నుంచి గాలి తుంపర్ల ద్వారా ఇతరులకు వ్యాపిస్తుంది. ఒకటి నుంచి అయిదు మచ్చలు ఉంటే ఇంటి వద్దే చికిత్స అందిస్తారు. అంతకు మించితే చికిత్సకాలం 6 నెలలు నుంచి 12 నెలలు ఉంటుంది. ఒకప్పుడు 50 ఏళ్ల దాటిన వారిలో బయటపడేది. ఈ మధ్యకాలంలో 25 ఏళ్ల లోపు వారిలోనూ లక్షణాలు కనిపిస్తున్నాయి. దీని ద్వారా కంటి రెప్పలకు త్వరితగతిన పక్షవాతం వచ్చే అవకాశాలు ఎక్కువ. చేతులపై పుండ్లు, బొబ్బర్లు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. వేడి, చల్లటి వస్తువులను పట్టుకునే సమయంలో ఎలాంటి చలనం లేకపోయినా అనుమానించాలి. వ్యాధిగ్రస్తులకు అవసరమైన వాకర్స్ హేండెక్స్, మైక్రో సెల్యూలర్ రబ్బర్ తదితర పరికరాలు సరఫరా చేసేందుకు గత ఐదేళ్లగా అరకొర నిధులతో అవస్థలు పడుతున్నారు. వాకర్స్ 2లో

పోలింగ్ ఘర్షణల నేపథ్యంలో

284 మందిపై కేసులు

- 255 మంది అరెస్ట్
- అల్లర్లు సృష్టించడానికి ప్రయత్నిస్తే కఠినచర్యలు
- ఎస్పీ వకుల్ జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో ఎవరైనా ఘర్షణలకు పాల్పడినా, అల్లర్లు సృష్టించడానికి ప్రయత్నించినా వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. జిల్లాలో పోలింగ్ రోజున, తదనంతరం జరిగిన ఘర్షణలపై మొత్తం 284 మంది పై 36 కేసులు నమోదు చేశామని,255 మందిని అరెస్ట్ చేసి 41(ఎ)సీఆర్‌పీసీ నోటీసు జారీ చేశామని తెలిపారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చినప్పటి నుండి శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నమైన వివిధ ఘటనలపై 24 మందిపై 13 కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. 24 మందిని అరెస్ట్ చేశామన్నారు. వారిలో 22 మందికి నోటీసు జారీ చేసి, ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన ఘటనలపై మరో 21 కేసులు నమోదు చేసి.. 42 మందిని అరెస్ట్ చేసి 41(ఎ)సీఆర్‌పీసీ నోటీసు జారీచేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సమస్యాత్మక గ్రామాలలో, ప్రాంతాలలో పోలీస్ పికెట్‌లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ ప్రాంతాలలో పోలీస్ అధికారులు పెట్రోలింగ్ నిర్వహిస్తూ, అవాంఛనీయ ఘటనలకు, ఘర్షణలకు పాల్పడితే తీసుకునే చట్టపరమైన చర్యల గురించి, తదనంతర పరిణామాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. జిల్లాలో పోలింగ్ రోజున, తదనంతరం రోజున ఘర్షణలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేశామని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఘర్షణలకు పాల్పడిన వారికి సంబంధిత పోలీస్ అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు, అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా సంయమనంతో వ్యవహరించాలని సూచించడం జరిగిందన్నారు. ఘర్షణలకు పాల్పడడానికి అవకాశం ఉన్న వారిపై, చెడునడత కలిగిన వ్యక్తులపై, రౌడీషీటర్స్‌పై నిఘా వుంచామన్నారు. జిల్లాలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన, ఘర్షణలకు పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

గెలుపుపై అభ్యర్థుల ధీమా.!

(మొదటిపేజీ తరువాయి)

రఘుపతికి వ్యతిరేకంగా ఉన్నవారు వైసిపి అధిష్టానం కోనకు టిక్కెట్ ఇవ్వడాన్ని నిరశిస్తూ పార్టీని వీడి టిడిపిలో చేరారు. అయినప్పటికీ ఎన్నికల నిర్వహణలో అనుభవం ఉన్న కోన తనదైన శైలిలో ఎన్నికల ప్రచారాలు జరిపారు. టిడిపి అభ్యర్థి తనతో కలసి వచ్చిన అందరినీ కలుపుకుంటూ ప్రచార పర్వాన్ని పూర్తి చేశారు. చీరాల నుంచి వైసిపి తరపున కరణం వెంకటేష్ పోటీ చేయగా టిడిపి నుంచి మద్దులూరి మాలకొండయ్య, కాంగ్రెస్ తరపున ఆమంచి కృష్ణమోహన్ పోటీ చేశారు. చీరాల నుంచి త్రిముఖ పోటీ జరిగింది. వైసిపి, టిడిపి తరపున ఇద్దరు అభ్యర్థులు చీరాల నుంచి మొదటిసారి పోటీ చేయగా, ఆమంచి నాలుగోసారి ఎన్నికల బరిలో నిలిచారు. చీరాల ఎమ్మెల్యేగా ఉన్న కరణం బలరాం తన కుమారుడు వెంకటేష్ తరపున విస్తృతంగా ఎన్నికల ప్రచారాల్లో పాల్గొన్నారు. ముగ్గురు అభ్యర్థులు ఎన్నికల్లో గెలుపు కోసం సర్వశక్తులూ ఒడ్డారు. జిల్లాలోని ఇతర నియోజక వర్గాలతో పోల్చి చూస్తే చీరాలలో సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ మందగొడిగా సాగింది. ఐదు గంటల నుంచి పోలింగ్ ముగిసే లోపు సుమారుగా 20 శాతం ఓటింగ్ నమోదయింది. దీంతో పాటు మహిళలు అత్యధికసంఖ్యలో ఓట్లు వేశారు. చీరాల వైసిపి, టిడిపి అభ్యర్థుల్లో ఎవరైతే చివరి వరకు ఓటరును ప్రసన్నం చేసుకున్నారో వారికే గెలుపు అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. జిల్లాలో చీరాల, బాపట్ల నుంచి ఎవరు గెలుస్తారనే విషయమై విస్తృత స్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. బాపట్ల పార్లమెంట్ నుంచి ఎన్నికల బరిలో వైసిపి తరపున సిట్టింగ్ ఎంపి నందిగం సురేష్, టిడిపి తరపున తెన్నేటి కృష్ణప్రసాద్, కాంగ్రెస్ తరపున జెడి శీలం పోటీ చేశారు. 2019 ఎన్నికల్లో నందిగం సురేష్ 16 వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆ తరువాత నియోజవర్గం నుంచి పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. సర్వేలతో సంబంధం లేకుండా వైసిపి అధినేత జగన్ నందిగంకు సీటు ఇచ్చారు. ఎంపీ అభ్యర్థులు తమ ఎమ్మెల్యే అభ్యర్థులతో కలసి నామమాత్రపు ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సారి గెలుపెవరిదో చూడాలి.

చాప కింద నీరులా 'కుష్టు'

(మొదటిపేజీ తరువాయి)

హేండ్ స్టిక్స్ వంటి పరికరాలకు ఏటా రూ.50 వేలు బడ్జెట్ ఉండేది. దీన్ని రూ.10 వేలకు కుదించారు. ఎంసీఆర్ పరికరాలకు రూ. లక్షల్లో ఉండే బడ్జెట్ తగ్గించేశారు. దీంతో దాతలసాయంతో వ్యాధిగ్రస్తులకు పరికరాలు అందిస్తున్నారు.

ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నాం..

డాక్టర్ డి సురేష్ కుమార్, డిఎంఅండ్‌హెచ్‌వో, ఒంగోలు

ఎవరికైనా కుష్ఠువ్యాధి లక్షణాలుంటే ధైర్యంగా ఆసుపత్రికి వస్తే అంగవైకల్యం బారినపడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఆసుపత్రికి వచ్చేందుకు ఇబ్బందులు ఉంటే నిర్దేశించిన ప్రభుత్వ వైద్యులే స్వయంగా సిబ్బందితో ఆయా ప్రాంతాలకు వెళ్లి అవసరమైన వైద్య పరీక్షలు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో పాటు దాతల సాయంతో వ్యాధిగ్రస్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.



కోలాటం వేస్తున్న బాలికలు

ఘనంగా బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల మండలంలోని పెద్దదోర్నాల, బొమ్మలాపురం, కటకానిపల్లి గ్రామాల్లో శుక్రవారం బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కోలాటం ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి ప్రజలు భారీ స్థాయిలో వచ్చి మహోత్సవాన్ని తిలకించారు.

విద్యుత్ ప్రమాదంలో 11 నెలల చిన్నారి మృతి

ప్రజాశక్తి-చీరాల



మృతిచెందిన బాలుడు

ముక్కుపచ్చలారని చిన్నారి.. ఒక నెలలో మొదటి పుట్టినరోజు జరుపుకోవాల్సిన ఆ చిన్నారి విద్యుత్ ప్రమాదంలో మృత్యు ఒడికి చేరాడు.. ఆ చిన్నారిని ప్రాణంగా చూసుకుంటున్న తల్లిదండ్రులు గుండె కోతతో దిక్కులు పిక్కటిల్లేలా రోదిస్తున్నారు. ఈ హృదయ విదారక ఘటన చీరాల మండలం విజయనగర కాలనీ గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. విజయనగర కాలనీలో నివాసం ఉంటున్న వినోద్, దివ్య ఇద్దరూ కుటుంబ సభ్యులను ఒప్పించి ప్రేమ వివాహం చేసుకున్నారు. వినోద్ అద్దె ఆటో తోలుతూ జీవనం సాగిస్తున్నాడు. అయితే పిల్లల కోసం ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న తరుణంలో లేక లేక ఒక సంతానం కలిగింది. బిడ్డ పుట్టినప్పుడే ప్రాణాపాయం ఉందని వైద్యులు చెప్పినప్పటికీ కంటికి రెప్పలా చూసుకుని వైద్యం అందిస్తూ బ్రతికించుకున్నారు. అయితే శుక్రవారం కురిసిన వర్షంతో ఇంటిలో షార్ట్ సర్క్యూటివ్ ఏర్పడింది. ఆ చిన్నారి రియాన్ హన్స్(11 నెలలు) నేల మీద పాకుతూ నీటి మోటారును తాకటంతో కరెంట్ షాక్ తగిలి పెద్దగా ఏడ్చి మృతిచెందాడు. తల్లిదండ్రులు గమనించి బాలుడిని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. వైద్య పరీక్షలు అందించిన వైద్యులు బాబు చనిపోయాడని చెప్పడంతో ఆ కన్నపేగు తల్లడిల్లిపోయింది. తమ బిడ్డ బతికే ఉన్నాడనుకొని ఆశ చావక 108 వాహనాన్ని పిలిపించుకుని పరీక్షలు కూడా చేయించారు. అయినా ఫలితం లేకపోయింది. వచ్చే నెలలో బిడ్డ పుట్టినరోజు ఎంతో ఆర్భాటంగా చేసుకుందామని కలలుగన్న ఆ తల్లిదండ్రుల ఆశలు ఒక్కసారిగా ఆవిరి అయిపోయాయి. చుట్టుపక్కల స్థానికులు సైతం ఈ ఘటన చూసి తల్లడిల్లిపోతున్నారు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు సంఘటన జరిగిన స్థలాన్ని పరిశీలించారు. బిడ్డను కోల్పోయిన ఆ తల్లిదండ్రుల రోదన చూపరులను కంటతడి పెట్టించింది.

విరిగిన ధ్వజస్తంభం

ప్రజాశక్తి-కొనకనమిట్ల: కొనకనమిట్ల మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ వెలుగొండ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధ్వజస్తంభం నేల కొరిగింది. విషయం తెలుసుకున్న ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఉన్నత అధికారులకు తెలియజేశారు. ఎన్నో సంవత్సరాలుగా ఉన్న ఈ ధ్వజస్తంభం శుక్రవారం ఒక్కసారిగా విరిగిపడింది.



ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

అన్నదాన సత్రం అభివృద్ధికి ప్రణాళిక

ప్రజాశక్తి-మార్కాపురం

వెలుగొండ క్షేత్రం శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలోని శ్రీకృష్ణ యాదవ్ అన్నదాన సత్రం అభివృద్ధికి ప్రణాళికలతో కూడిన పుస్తకాన్ని మార్కాపురం పట్టణంలో శుక్రవారం ఆవిష్కరించారు. వెలుగొండ క్షేత్రంలోని శ్రీకృష్ణ యాదవ్ అన్నదాన సత్రం కమిటీ సమావేశానికి గౌరవ అధ్యక్షుడు సాదం వీరయ్య యాదవ్ అధ్యక్షత వహించారు. భోజనశాల, తారు రోడ్డు నిర్మాణం, కళా మందిరం వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణం, సత్రం ఆవరణలో సిమెంట్ కాంక్రీట్‌తో బెడ్ వేయించడం, వంటగది నిర్మాణం, పేద యాదవులకు ఆర్థిక సహకారం అందించడం వంటి పనులకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించారు. యాత్రికులకు అన్నదానం జరిగేలా చూడాలన్నారు. దాతల ద్వారా విరివిగా విరాళాలు సేకరించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో అధ్యక్షులు బొరిగొర్ల బాలయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి మంగళకుంట గుమ్మా రాజేంద్రప్రసాద్, కోశాధికారి పొడతరపు వెంకటేశ్వరరావు యాదవ్, ఉపాధ్యక్షులు ఉప్పుటూరి కాశయ్య యాదవ్, సహాయ కార్యదర్శి నాగం ప్రసాద్ యాదవ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాగరాజుకు ఎమ్మార్పీఎస్ నాయకుల పరామర్శ



నాగరాజును పరామర్శిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పొదిలి

రెండు రోజుల క్రితం ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడ్డ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగను పలువురు ఎంఆర్‌పిఎస్ నాయకులు శుక్రవారం సాయంత్రం గుంటూరులోని లలిత హాస్పిటల్‌లో పరామర్శించారు. బుధవారం సాయంత్రం ఆయన తన స్వగృహం చీరాల విజయనగర్ కాలనీలో ప్రమాదవశాత్తు జారిపడ్డారు. పరీక్షించిన డాక్టర్లు ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, భయపడవలసిన అవసరం లేదని తెలిపారు. నాగరాజును పరామర్శించిన వారిలో ప్రకాశం జిల్లా ఎంఎస్ఎఫ్ అధ్యక్షులు తొరటి ఆనంద్ మాదిగ, ప్రకాశం జిల్లా జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షులు గురిజాల బాబురావు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు రావినూతల కోటయ్య మాదిగ ఉన్నారు.

మెజారిటీపైనే చర్చ

మార్కాపురం నియోజకవర్గ ఎన్నికల ఫలితాలపై ఎడతెగని ఉత్కంఠ

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం నియోజకవర్గంలో ఇరు పార్టీల్లోనూ మెజార్టీపైనే చర్చ సాగుతోంది. వైసిపి తరపున అన్నా వెంకట రాంబాబు, టిడిపి తరపున కందుల నారాయణరెడ్డి పోటీలో ఉన్నారు. మిగిలిన అభ్యర్థులంతా నామమాత్రమే. 2019 ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ చేసిన కుందూరు నాగార్జునరెడ్డి 18,600 ఓట్లకు పైగా మెజారిటీతో గెలుపొందారు. ఆ ఎన్నికల్లో మార్కాపురం పట్టణంలో టిడిపికి 1,450 ఓట్ల పైచిలుకు మెజార్టీ లభించింది. మార్కాపురం మండలం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాలన్నీ వైసీపీకి మెజార్టీ తెచ్చిపెట్టాయి. మార్కాపురం పట్టణంలో టిడిపి బలాన్ని తగ్గించేందుకు ప్రస్తుత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా అన్నా వెంకట రాంబాబును బరిలో దింపారు. మార్కాపురం పట్టణంలో ఆర్యవైశ్యుల ఓట్లు అధికంగా ఉన్నాయి. అన్నా రాంబాబు కూడా అదే సామాజిక వర్గానికి చెందినవాడు కావడంతో టిడిపిలో మొగ్గుగా కొనసాగుతున్న ఆర్యవైశ్యుల ఓట్లు వైసిపికి లభిస్తాయని ఆశించింది. వైసిపి అనుకున్నట్లుగానే అన్నా రాంబాబుకు, ఆయన సామాజిక వర్గానికి చెందిన ఓట్లు మెజారిటీగా లభిస్తాయనే చర్చ జరుగుతోంది. దీంతో తెలుగుదేశం పార్టీకి మార్కాపురం పట్టణంలో గట్టి దెబ్బ తగిలిందని రాజకీయ నాయకులు అంటున్నారు. వైసిపికి మెజార్టీ రాని మార్కాపురం పట్టణంలో ఈ ఎన్నికల్లో మెజార్టీ రావచ్చనే భావనలో వైసిపి నేతలు ఉన్నారు. తమ మెజారిటీ ఐదువేల పైమాటే అని వైసిపి నేతలు చెబుతున్నారు. మార్కాపురం మండలంలో 3,000, తర్లుపాడు మండలంలో 1,000, కొనకనమిట్ల మండలంలో 4,000, పొదిలి మండలము పట్టణం కలిపి 5 వేలకు తగ్గకుండా మెజార్టీ లభిస్తుందని వైసిపి భావిస్తోంది. తక్కువలో తక్కువ అనుకున్నా పదిహేను వేల మెజార్టీతో అన్నా రాంబాబు గెలుస్తారని ఆ పార్టీ నేతలు ఉన్నారు.

ఇదే క్రమంలో టిడిపి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి కూడా గెలుపొందుతారని టిడిపి భావిస్తోంది. పలుమార్లు ఓడిపోయిన కందుల నారాయణరెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఘటనలను ఓటర్లు అర్థం చేసుకున్నారని, అభ్యర్థి నారాయణరెడ్డిపై సానుభూతి ఉందని టిడిపి నేతలు గట్టి నమ్మకంతో ఉన్నారు. వైసిపి నేతలు చెప్పుకున్నంత మెజార్టీలు ఎక్కడ ప్రస్తుతం కనబడటం లేదని టిడిపి క్యాడర్ కొట్టి పారేస్తోంది. మార్కాపురం పట్టణంలో గతంలో కంటే మెరుగైన ఫలితాలు సాధిస్తామని టిడిపి భావిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో వైసీపీకి మెజార్టీ వస్తే.... తమకు మార్కాపురం పట్టణంలో మంచి మెజార్టీ రానుందని, గెలుపు ఖాయం అంటూ టిడిపి నేతలు చెబుతున్నారు. ఎక్కడ నలుగురు కూర్చున్నా ఓట్ల పంచాయతీనే నడుస్తోంది. ఇలా ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. ఎవరు గెలుస్తారు.. ఎవరు ఓడుతారు అనేది జూన్ 4వ తేదీన లెక్కింపులో తేలనుంది.

ప్రజాశక్తి
శనివారం 18 మే 2024

రహదారిపై గుంతలు.. రాకపోకలకు అవస్థలు

ప్రజాశక్తి - నాగులుప్పలపాడు

మండల పరిధిలోని ఉప్పుగుండూరు గ్రామంలో వసుంధర కోల్ట్‌స్టోరేజ్ సమీపంలో 216 జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి వచ్చే రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డు పొడవునా గుంతలు ఏర్పడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు, వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. 216 జాతీయ రహదారిని రెండేళ్ల క్రితం నిర్మించారు. అప్పటి జాతీయ రహదారి నుంచి నుంచి గ్రామాలోకి వెళ్లే రహదారి మోక్షం కలుగలేదు. రహదారి పొడువునా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఆ రహదారిపై ప్రయాణించే ఆటోలు, ఆర్ టిసిలు బస్సులు డ్రైవర్లు, ద్విచక్ర వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయంలో దగ్గరకు వచ్చే వరకూ గుంతలు కానరాక అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదానానికి గురికావాల్సి వస్తుందోనని వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. ఉప్పుగుండూరు గ్రామం వ్యాపార కేంద్రం. దీంతో దనియాలు, అపరాలను లారీలు, ఆటోల్లో రవాణా చేస్తుంటారు. దీంతో దనియాలు, అపరాల లోడ్‌తో వెళ్లే వాహన చోదకులు ఈ గుంతల కారణంగా అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అదేవిధంగా ప్రతి అరగంటకు చీరాల నుంచి ఒంగోలుకు ఆర్‌టిసి బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. గుంతల కారణంగా వచ్చే కుదుపులకు ప్రయాణికులు అల్లాడి పోతున్నారు. ముఖ్యమంగా వృద్ధులు, చిన్నారులు, మహిళలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఒమ్మెవరం మట్టిగుంట, ఈదుమూడి గ్రామాల ప్రజలు కూడా ఇదే రహదారిపై రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో వారు కూడా అవస్థలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేయించి తమకు ఇక్కట్ల నుంచి కాపాడాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.



గుంతలలో అధ్వానంగా తయారైన రహదారి

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

ప్రజాశక్తి-త్రిపురాంతకం

విద్యుత్ షాక్‌తో ఓ యువకుడు మృతి చెందాడు. ఈఘటన మండల పరిధిలోని గణపవరం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గణపవరం గ్రామానికి చెందిన మాచర్ల కొండలు (35) అనే యువకుడు ఐస్ క్రీమ్‌లు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఐస్ క్రీమ్ బండికి ఛార్జింగ్ పెడుతుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు.



మృతిచెందిన కొండలు

బాలికపై అత్యాచార యత్నం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

బాలికపై అత్యాచార యత్నానికి యత్నించిన వ్యక్తిపై పోలీసులు ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అందిన వివరాల ప్రకారం... మండలంలోని చిన్నదోర్నాల గ్రామానికి చెందిన ఓ బాలిక గురువారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో బహిర్భూమికి వెళ్లింది. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన యలకపాటి ప్రవీణ్ అనే యువకుడు కాపుకాచి బాలికపై అత్యాచార యత్నానికి యత్నించాడు. దీంతో బాలిక భయంతో కేకలు వేయడంతో ప్రవీణ్ పారిపోయాడు. బాలిక తల్లిదండ్రులు ఈ విషయంపై పెద్దదోర్నాల పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. నిందితుడిపై ఫోక్స్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంకమరావు తెలిపారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు.

ఆటోను ఢీకొన్న పాలవ్యాను ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ఆగి ఉన్న ఆటోను పాల వ్యాను ఢీకొన్న ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన సంతనూతలపాడు సమీపంలోని మునగా చెన్నయ్య కోల్డ్ స్టోరేజ్ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... ఒంగోలు నుంచి సంతనూతలపాడు వైపు వస్తున్న ఆటోలో నుంచి కోల్‌స్టోరేజ్ వద్ద ప్రయాణికులు దిగుతున్నారు. అదే సమయంలో సంతనూతలపాడు నుంచి ఒంగోలు వైపు వెళుతున్న జెర్సీ పాల వ్యాను ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఓ వ్యక్తికి తీవ్రగాయాలు కావడంతో ఆయన్ని ప్రైవేటు వైద్యశాలకు తరలించినట్లు తెలిసింది.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కంటైనర్

ప్రజాశక్తి-బాపట్ల

బైకును తప్పించబోయి కంటైనర్ అదుపుతప్పిన విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ఘటన బాపట్ల–కర్లపాలెం జాతీయ రహదారి మార్గంలో నందిరాజు తోట వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. కర్లపాలెం వైపు నుంచి వస్తున్న కంటైనర్ బైకు తప్పించబోయి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో లారీ ముందు భాగం దెబ్బతింది. విద్యుత్ స్తంభానికి నష్టం వాటిల్లింది. దెబ్బతిన్న విద్యుత్ స్తంభానికి నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ విద్యుత్ శాఖ అధికారులు లారీ యజమానిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - అద్దంకి

మద్యం మత్తులో కింద పడిపోవడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన పట్టణంలోని కాకానిపాలెం మండపం సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. అందిన వివరాలకు ప్రకారం... అద్దంకి పట్టణానికి చెందిన వెంకట్రావు అనే వ్యక్తి బజారుకు వచ్చి పూటుగా మద్యం సేవించాడు. అనంతరం ఇంటికి వెళుతున్నాడు. ఈ క్రమంలో రోడ్డుపై పడిపోయాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కౌంటింగ్ ఏజెంట్లను నియమించుకోవాలి

ఎన్నికల రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావు

ప్రజాశక్తి-దర్శి

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జూన్ 4న జరుగుతుందని, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు తమ ఏజెంట్లను నియమించుకోవాలని దర్శి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావు తెలిపారు. తహశీల్దారు కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, వారి ప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్వరరావు మాట్లాడుతూ దర్శి నియోజక వర్గం పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఇవిఎంలను ఒంగోలులోని రైస్ కాలేజీలో భద్రపరించినట్లు తెలిపారు. కౌటింగ్ ముందే అభ్యర్థులు తమ ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. అదేవిధంగా చీఫ్ ఏజెంట్‌ను కూడా ముందుగా నియమించుకో వచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వారి ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావు

పుస్తక పఠనంతో విజ్ఞానం

ప్రజాశక్తి-కొండపి

పుస్తక పఠనంతో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యా యుడు అగ్గిరాముడు తెలిపారు. స్థానిక గ్రంథాయలంలో వేసవి శిక్షణా కార్యక్రమాన్ని గ్రంథ పాలకుడు బి.కోటేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్గి రాముడు మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవులలో ఖాళీగా ఉండకుండా గ్రంథాలయానికి వచ్చి అక్కడే అందుబాటులో ఉన్న విజ్ఞాన వంతమైన, నీతి కథల పుస్తకాలను చదవాలన్నారు. అనంతరం వేసవి శిక్షణా కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల చేత కథల పుస్తకాలు చదివించారు. అందులోని నీతి గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం ఆంగ్లభాష నైపుణ్యంపై శిక్షణ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు అగ్గిరాముడు



పశుపోషకులకు మినరల్ మిక్చర్ అందజేస్తున్న బేబిరాణి

పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల గొర్రెలు, మేకల పెంపకందారులు, పశు పోషకులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధకశాఖ జెడిఎ డాక్టర్. కె బేబిరాణి తెలిపారు. మండల పరిధిలోని ఉప్పు గుండూరు గ్రామంలో పశువులు, గొర్రెలకు సీజనల్ వ్యాధులు సోకకుండా టీకాలు వేశారు. ఈ సందర్భంగా బేబిరాణి మాట్లాడుతూ పశువులకు గొర్రెలు, మేకలకు గొంతువాపు ,చిటికె వ్యాధి రాకుండా ముందజాగ్రత్త చర్యల్లో భాగంగా పశువులు, గొర్రెలు, మేకలకు టీకాలు వేసినట్లు తెలిపారు. అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పశుపోషకులకు వినరల్ మిక్చర్‌పంపినీ చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యశాల వైద్యుడు డాక్టర్ జాస్మిన్, సిబ్బంది, గొర్రెలు, మేకల పెంపకందార్లు, పశుపోషకులు తదితరులు పాల్గొన్నారు.

దర్శిలో అన్నదానం

ప్రజాశక్తి - దర్శి

మండల పరిధిలోని పలు గ్రామాలలో బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ దర్శిలోని బ్రహ్మంగారి గుడిని సందర్శించారు. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న దానాన్ని బూచేపల్లి వెంకాయమ్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు, ఆలయ కమిటీ నాయకుడు కట్టెకోట హరీష్ పాల్గొన్నారు. అదేవిధంగా బొట్లపాలెం, తూర్పుచౌటపాలెం గ్రామాలలో బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు,.

కనిగిరి : కనిగిరి పట్టణంలోని గార్లపేట రోడ్డులోనున్న దొంతలమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి బ్రహ్మేంద్ర స్వామి, మరియు దొంతలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

ఓటరు తీర్పు ఎవరి వైపు.?

◆ నలుగురు కలిసిన ప్రతిచోటా అదే చర్చ ◆ పెరిగిన ఓటింగ్ శాతంపై అందరిలో ఆసక్తి ◆ విజయంపై ఇరుపార్టీల అభ్యర్థుల ధీమా

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

పర్చూరు నియోజకవర్గంలో ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలు చెదురు మదురు ఘటనలు మినహా ప్రశాంతంగా జరిగాయి. గతంలో కంటే అధికంగా పోలింగ్ నమోదైనది. 87.01శాతం ఓటర్లు ఓటు వేశారు. పోలింగ్ సమయానికి ముందుగానే ఓటర్లు వచ్చి ఓటు వేసేందుకు లైన్లలో వేచి ఉండడం ఈ దఫా ఎన్నికల్లో విశేషం. పోలింగ్ శాతం అధికంగా నమోదు కావడంతో ఈ సారి ఓటర్ల తీర్పు ఎలా ఉంటుందోనని చర్చ కొనసాగుతోంది. నలుగురు కలిసిన ప్రతి చోటా ఎన్నికల ఫలితాలపైనే చర్చ జరుగుతుంది. విజయ అవకాశాలు గురించే చర్చించుకుంటున్నారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఎంఎల్ఎ అభ్యర్థి ఏలూరి సాంబశివరావు గెలుపు అంశమే కాకుండా వైసిపి అభ్యర్థి యడం బాలాజీపై ఎంత మెజారిటీ సాధిస్తారనేది కూటమి నేతలు, కార్యకర్తలతో పాటు ప్రజల్లో చర్చ నడుస్తోంది. అదే రీతిలో వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి యడం బాలాజీకి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలతో చాప క్రింద నీరులాగా ఓట్లు పోలయ్యి విజయ అవకాశాలు తమ నేతకే మెండుగా ఉన్నాయని వైసిపి నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అభ్యర్థుల ధీమా చూస్తున్న ఆయా పార్టీల అభిమానులు బెట్టింగులకు సిద్ధమవుతున్నారు. వివిధ గ్రామాల్లో ఎవరి స్థాయిలో వాళ్ళ నగదు పందెంకు దిగినట్లు నియోజకవర్గంలో చర్చ జరుగుతుంది. ఎవరేమి విశ్లేషించినప్పటికీ ప్రజలు ఇచ్చిన తీర్పు ఏమిటనేది జూన్ 4న ఇవిఎంలు తెరిస్తే తేలిపోతుంది.



మార్టూరులో బారులు తీరిన ఓటర్లు (ఫైల్‌ఫోటో)

అత్యధిక ఫీచర్లతో మారుతీ న్యూఎపిక్ స్విఫ్ట్

కారు లాంచ్ చేసిన ఎస్‌బిఐ మేనేజర్ వి రామానాయుడు

ప్రజాశక్తి - చీరాల

కొత్తపేట ఆర్టీఓ కార్యాలయ సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న జయలక్ష్మి ఆటోమొబైల్స్ మారుతి షో రూమ్‌లో న్యూ ఎపిక్ స్విఫ్ట్ ఫోర్త్ జనరేషన్ కారు ప్రారంభోత్సవ వేడుకలు షోరూం మేనేజర్ ఎస్ గయాజ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఎస్‌బిఐ చీరాల బ్రాంచ్ మేనేజర్ వి రామానాయుడు హాజరై కొత్త మోడల్ కారును ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం నిర్వాహకులు మాట్లాడారు. కస్టమర్లకు నాణ్యమైన సేవలు అందిస్తూ వినియోగ దారుల అవసరాలకు అనుగుణంగా సరికొత్త వాహనాలను మారుతి జయలక్ష్మి షోరూం తీసుకొస్తుందని అన్నారు. అందరికీ అందుబాటులో ఉండే ధరలతో అత్యాధునిక ఫ్యూచర్లతో తయారు చేసిన న్యూ ఎపిక్ స్విఫ్ట్ కారు ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని అన్నారు. ఆటోమేటిక్ గేర్ సిస్టం అందుబాటులో తీసుకు రావడంతో పాటు లీటరుకు 25.75కిలోమీటర్లు, 6 ఎయిర్ బ్యాగ్, వైర్లెస్ చార్జర్ వంటి సౌకర్యాలు ఇందులో పొందుపర్చినట్లు తెలిపారు. ఖాతాదారులకు బ్యాంకు, ప్రైవేట్ ఫైనాన్స్ వంటి సదుపాయాల ద్వారా అతి సులువైన ప్రాసెస్‌తో కస్టమర్ల కారు కల నిజం చేసేలా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కారు బుకింగ్ జరుగుతున్నాయని తెలిపారు. పూర్తి వివరాల కోసం షో రూమ్‌కు వచ్చి సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఫైనాన్సర్లు, షోరూం మేనేజర్ ఎస్ గయాజ్, టిఎల్‌వి సుధాకర్, షోరూం సిబ్బంది కటారి కవిత, ఎన్ కృష్ణ పాల్గొన్నారు.



కొత్త కారు ఆవిష్కరిస్తున్న బ్యాంక్ మేనేజర్ రామానాయుడు



వృద్ధులకు గొడుగులు అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

వృద్ధాశ్రమానికి చేయూత

ప్రజాశక్తి - పర్చూరు

నూతనంగా ఏర్పాటు చేసిన ఆశ్రయ వృద్ధాశ్రమానికి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అమెరికాలో ఉంటున్న వరగాని గ్రామానికి చెందిన వెలగా చార్వాణి ఆర్థిక సహకారంతో రూ.పదివేల విలువైన ఇనుప బీరువా, గొడుగులు, పండ్లు, బ్రెడ్‌ను క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వృద్ధాశ్రమ నిర్వాహకులు, వృద్ధులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ చక్కగా కలిసి మెలిసి ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఆశ్రమ నిర్వాహకుడు భవనం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రోటరీ క్లబ్ సభ్యులకు, దాతలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి పంబి సదా నందరెడ్డి, రోటరీ సభ్యులు పాబోలు ఉదయ భాస్కర్, కోమటి ఆంజనేయులు, పాబోలు వెంకన్న, పోలిశెట్టి చంద్రం పాల్గొన్నారు.



ఎపిఇఎపి సెట్ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు

ప్రారంభమైన ఎపిఇఎపి సెట్ పరీక్ష

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో ఏపి ఇంజినీరింగ్, అగ్రికల్చర్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎపిఇఎపి సెట్ -2024) పరీక్షలు గురువారం నుండి ప్రారంభమైనట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు శుక్రవారం తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ ఉన్నత సాంకేతిక విద్యా మండలి ఆధ్వర్యంలో కాకినాడ జెఎన్టియు పర్యవేక్షణలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ కళాశాలలోని టిసిఎస్ ఐయాన్ సెంటర్ నందు ఈనెల 16నుండి 23 వరకు కళాశాల్లో పరీక్షలు ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె జగదీష్ బాబు తెలిపారు. మొదటి షిఫ్టులో 245మందికి 226మంది, సాయంత్రం షిఫ్టులో 247 మందికి 235మంది కలిపి 492మందికి 461మంది అభ్యర్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు.



చీరాలలో వర్షంతో ఊపిరి పీల్చుకున్న పట్టణ ప్రజలు

వర్షంతో ఊరట

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

మండలంలో శుక్రవారం చిరుజల్లులు కురిశాయి. ఉదయం ఏడు గంటల నుంచి 11 గంటల వరకు చిరు జల్లులు కురవడంతో ప్రజలు సేద తీరారు. ఇటీవల ఎండల తీవ్రత వల్ల పెరిగిన ఉష్ణోగ్రతలతో అల్లాడిపోయిన ప్రజానీకానికి ఈ వర్షం కాస్త ఉపశమనం కలిగించింది. చాలా కాలంగా వర్షాలు కురవకపోవడంతో పచ్చిక లేక పశువుల మేతకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ వర్షంతో పశువులకు మేత దొరుకుతుందని, కూరగాయ పంటలకు ఊపిరి పోసిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చీరాల: పట్టణంలో శుక్రవారం తెల్లవారు జామున 4గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వర్షం జల్లులు పడుతుండటంతో చల్లని వాతావరణం ప్రజలకు ఆహ్లాదాన్నిచ్చింది. వర్షం ప్రభావానికి పనులు నిమిత్తం రోడ్లపైకి వచ్చే ప్రజలు గొడుగులు, రెయిన్ కోటులు వాడుకున్నారు.

వ్యాధులు పట్ల ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి - బాపట్ల

ఒకరి ద్వారా మరొకరికి మానవ సంహితంగా సంక్రమించని (నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్) గుండె జబ్బులు, క్యాన్సర్, మధుమేహం, ఊపిరితిత్తుల వంటి దీర్ఘకాలిక వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించి ఆరోగ్య సేవలు అందిస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి ఎస్ విజయమ్మ తెలిపారు. ప్రపంచ హైపర్ టెన్షన్ డే సందర్భంగా కలెక్టరు పి రంజిత్ భాషా, జాయింట్ కలెక్టరు చామకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖ పర్యవేక్షణలో కలెక్టర్ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులకు బిపి, లిపిడ్ ప్రొఫైల్, సిబిపి (పూర్తి స్థాయి రక్త నమూనా) పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎం అండ్ హెచ్ఓ ఎస్ విజయమ్మ మాట్లాడుతూ శిబిరంలో 130మంది ఉద్యోగులకు బీపీ, 79మందికి రక్త పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 30ఏళ్ళ వయస్సు పైబడిన వారికి ప్రత్యేకంగా బిపి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈనెల 18నుండి హైపర్ టెన్షన్ బీపీపై అవగాహన పెంచే రోజువారి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అందులో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి కార్యాలయం నుండి ప్రదర్శనగా వెళ్లి ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో అవసరమైన ప్రజలకు బీపీ పరీక్షలు నిర్వహించారు. వ్యాధులు పట్ల విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు విద్యాసంస్థల్లో ఒకరోజు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇమినైజేషన్ అధికారి టి వెంకటేశ్వర్లు, పిఓ - ఎన్‌సిడి ఎం సౌజన్య, ఎన్హిపి నోడల్ అధికారి బి బ్రహ్మం, జిల్లా మాస్ మీడియా అధికారిణి మరియమ్మ పాల్గొన్నారు.



ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యశాల సిబ్బంది

డెంగీపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

జాతీయ డెంగ్యూ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పిహెచ్‌సి, వెల్లటూరు పిహెచ్‌సి పరిధిలో డెంగి వ్యాధి నిర్మూలనకై తీసుకోవాల్సిన చర్యలపై ర్యాలీ నిర్వహించారు. వైద్యులు డాక్టర్ డివిఎల్ పద్మజ, సిహెచ్ రామలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో నినాదాలు చేశారు. డెంగ్యూ వ్యాధి దోమ వలన వ్యాపిస్తుందని, దోమలు ఉత్పత్తి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పంచాయతీ అధికారులు గ్రామాల్లో మురుగునీరు నిలవ లేకుండా ఎప్పటికప్పుడు బయటికి పంపించి బ్లీచింగ్, సున్నం వంటి నిర్మూలన చర్యలు చేపట్టాలని అన్నారు. వైద్యశాల సూపర్వైజర్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

కార్పెంటర్‌కు ఆదర్శ యూత్ సాయం

ప్రజాశక్తి - బాపట్ల

చెక్కపని పని చేసుకుంటూ జీవనం సాగించే కార్మికుడు ప్రమాద వశాత్తు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మగ్బుల్ భాషా కుటుంబానికి బాపట్ల ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ సభ్యులు ఆర్థిక సహాయం చేసి అండగా నిలిచారు. చెక్క పని చేసే క్రమంలో కాలు మిషన్‌లో పడి గాయపడడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న మగ్బుల్‌భాషాకు ఆర్గనైజేషన్ నిర్వాహకులు రూ.5వేలు ఆర్థిక సహాయం శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ గౌరవాధ్యక్షులు వేజండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ పట్టణంలోని పటేల్ నగర్ ప్రాంతంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న వడ్రంగి కార్మికుడు మగ్బుల్ భాష కుటుంబానికి తమ వంతు సహకారం అందజేశామని తెలిపారు. దాతలు ముందుకు వచ్చి బాధితుడి కుటుంబానికి సహాయ, సహకారాలు అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆదర్శ ఫ్రెండ్స్ అధ్యక్షులు బండ్రెడ్డి గోపి, కార్యదర్శి బత్తుల యజ్ఞ సురేష్, కోశాధికారి జోగి సువర్ణ, సభ్యులు యాసం రాజా రమేష్, కందుల శ్రీకాంత్, నరాలశెట్టి నాగరాజు, చామర్తి సుబ్బారావు, కొత్త మల్లికార్జునరావు పాల్గొన్నారు.



కార్పెంటర్‌కు ఆదర్శ సభ్యుల ఆర్థిక సహాయం

ఆ మూడు గ్రామాల్లో భారీగా ఓటింగ్

ప్రజాశక్తి- సంతమాగులూరు

సార్వత్రిక ఎన్నికల్లో అడవిపాలెం, పుట్టావారిపాలెం, ఏల్చూరు గ్రామాల్లో భారీగా ఓటింగ్ జరిగింది. అడవిపాలెంలో ఉన్న రెండు పోలింగ్ కేంద్రాల్లో 1535 మంది ఓటర్లకు 1445మంది తమ ఓటు వేశారు. 94 శాతం పోలింగ్ నమోదైనది. పుట్టావారి పాలెంలో ఒకే పోలింగ్ కేంద్రంలో 1197 ఓటర్లు ఉండగా 1077మంది ఓటు వేసి 90 శాతం పోలింగ్ నమోదు చేశారు. ఏల్చూరులో ఎనిమిది పోలింగ్ కేంద్రాలలో 7942 మంది ఓటర్లకు గాను 6938మంది ఓటు వేశారు. ఈ మూడు గ్రామాల్లో భారీగా పోలింగ్ నమోదు కావడంతో నాయకులు దృష్టి పెట్టారు. పెరిగిన పోలింగ్ శాతం ఏ అభ్యర్థికి అనుకూలంగా పడ్డాయని ఎవరికి వారు ఆరా తీస్తున్నారు.

ప్రజాశక్తి 5
శనివారం 18 మే 2024

కాయ్ రాజా కాయ్

- కొండపి నియోజక వర్గంలో జోరుగా బెట్టింగులు
- మండలాల వారీగా మెజార్టీపై పందేలు
- శింగరాయకొండ మండలంలో వచ్చే మెజార్టీపై కోట్లల్లో బెట్టింగ్



ప్రజాశక్తి-శింగరాయకొండ

సార్వత్రిక ఎన్నికలు ముగిశాక కొండపి నియోజక వర్గంలో గెలుపు గుర్రాలపై బెట్టింగులు ఊపందుకున్నాయి. గ్రామాలు, మండలాలు, నియోజకవర్గ స్థాయిలో బెట్టింగులు జరుగుతున్నాయి. వైసిపి అధికారంలోకి వస్తుందని కొందరు, టిడిపి అధికారంలోకి వస్తుందని కొందరు బెట్టింగులు పెడుతున్నారు. వైసిపికి 75 స్థానాలకు మించి రావని లక్షల్లో పందేలు కాస్తున్నారు. వైసిపి 100 సీట్లు వస్తాయని లక్షకు ఒకటిన్నర లక్ష చొప్పున పందేలు కాస్తున్నారు. కొండపి నియోజకవర్గంలో మండలాల వారీగా వచ్చే మెజార్టీలపై కూడా పందేలు కాస్తున్నారు. మర్రిపూడి మండలంలో వైసిపి 1500 మెజార్టీ వస్తుందని ఆ పార్టీలు నాయకులు పందేలు కడుతున్నారు. 1500 మెజార్టీ రాదని టిడిపి నాయకులు పందేలు కాస్తున్నారు. పొన్నలూరు మండలంలో తమకు 2 వేల మెజార్టీ వస్తుందని టిడిపి నాయకులు, 1000కి మించి రాదని వైసిపి నాయకులు పందేలు కాస్తున్నారు. కొండపిలో టిడిపి 500 మంచి రాదని వైసిపి నాయకులు, 1000కి పైగా మెజార్టీ వస్తుందని టిడిపి నాయకలు పందేలు కాస్తున్నారు. జరుగుమల్లి మండలంలోనూ మెజార్టీలపై వైసిపి, టిడిపి నాయకులు పందేలు కాస్తున్నారు. శింగరాయకొండ మండలంలో వచ్చే మెజార్టీ పై కూడా పందేలు ఊపందుకున్నారు. 2019 ఎన్నికల్లో శింగరాయకొండ మండలంలో వైసిపి నాలుగు వేల మెజార్టీ వచ్చింది. ఈ ఎన్నికల్లో టిడిపి మెజార్టీ వస్తుందని ఇక్కడ లక్షల్లో పందేలు కాశారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని కొందరు, వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని కొందరు పందేలు కాస్తున్నారు. ఈ పాటికే కోట్లాది రూపాయలు పందేలు కాశారు. కొండపి నియోజక వర్గంలో గెలుపు,ఓటమిపై కోట్ల రూపాయలు పందేలు కాశారు. ఇంకా కొందరు పందేలకు సై అంటున్నారు.



బాధితులతో మాట్లాడుతున్న నూకసాని బాలాజీ

బాధితులకు అండగా ఉంటాం

టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ

ప్రజాశక్తి-దర్శి

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మండల పరిధిలోని బొట్లపాలెంలో వైసిపి కార్యకర్తల దాడిలో గాయపడిన టిడిపి కార్యకర్తలను టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావులు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు బాధితులతో మాట్లాడి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ బొట్లపాలెంలో వైసిపి కార్యకర్తలు టిడిపి చెందిన బీసీలపై దాడికి పాల్పడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, నాయకులు మారెళ్ళ వెంకటేశ్వర్లు, శాగం కొండారెడ్డి, తాళ్లూరు ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు, పౌలు, సంఘ తిరుపతిరావు పాల్గొన్నారు.



ఎంఇఒను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

చీమకుర్తి ఎంఇఒగా నరసింహారావు

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి ఎంఇఒ-1గా డివిఎల్.నరసింహారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరిచారు. గతంలో ఇక్కడ ఎంఇఒ-1గా పనిచేసిన ఎస్. వెంకటేశ్వరరెడ్డి గత నెల 30న ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఆయన స్థానంలో మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానో పాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న నరసింహారావును ఎఫ్ఎసి ఎంఇఒగా డిఇఒగా నియమించారు. ఈ సందర్భంగా ఎంఇఒ నరసింహారావు మాట్లాడుతూ సమస్యలేమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్కె. అక్బర్, చలువాది శ్రీను, కోశాధికారి పర్వతం వెంకటేశ్వర్లు,ఉపాధ్యక్షుడు జి. వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు వీరారెడ్డి, పీరు సాహెబ్,పర్వతం భాస్కర్,శర్మ ,యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా కోశాధికారి చినస్వామి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎంఇఒ నరసింహారావును కలిసి అభినందలు తెలిపారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి- మద్దిపాడు

మద్దిపాడు మండలం మల్లవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈనెల 18 నుంచి 28వ వరకూ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి దామా నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 25న స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహించన్నుట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు అని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇఒ తెలిపారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-కొండపి

కొండపి పొగాకు వేలం కేంద్రానికి ధర్మవరం, కోయవారిపాలెం, వెంకటకృష్ణాపురం, ముక్కొడిపాలెం, తాటాలకుపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1,040 బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 1,000 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 40 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.304, అత్యల్ప ధర రూ.205 , సరాసరి ధర రూ.267.38 పైసలు పలికింది.

విద్యుత్ ఎఇపై ఫిర్యాదు

ప్రజాశక్తి-కొండపి

విద్యుత్ ఎఇ కుంచాల కోటయ్య తమను మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు గురిచేస్తున్నట్లు క్షేత్రస్థాయి ఉద్యోగులు వాపోతున్నారు. ఈ మేరకు స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్ సువర్చన్‌కు శుక్రవారం వినతి పత్రం సిబ్బంది అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కొత్తకొత్త నిబంధనలతో తమను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిపారు. నింబంధనలను తమకు రాత పూర్వకం ఇవ్వాలని అర్జీలో పేర్కొన్నారు. సిబ్బందితో సమావేశం నిర్వహించిన సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందిచాలని కోరారు. లేకుంటే సామూహికంగా నిరసనలు తెలియజేస్తామని హెచ్చరించారు.

అవ్వా తాతలకు అందని పింఛను

ప్రజాశక్తి-మార్కాపురం

ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయంతో వాలంటీర్ల సేవలకు బ్రేక్ పడ్డాయి. దీంతో అవ్వా తాతలు ఇబ్బంది పడుతున్నారు. అదే విధంగా పింఛను తీసుకునే వికలాంగులు, వితంతువులు కూడా అవస్థలు పడుతున్నారు. వాలంటీర్లు గతంలో ప్రతి నెలా 1న ఇంటి వద్దకు వచ్చి పింఛన్లు అందజేసేవారు. ఎన్నికల కోడ్ ఫలితంగా ఇంటి వద్ద పింఛన్ల పంపిణీ నిలుపుదల చేశారు. ఎన్నికల కమిషన్ నగదు డబ్బులు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో వేయాలని, ఖాతాలు లేని వారికి ఇంటి వద్ద ఇవ్వాలని ఆదేశించింది. కొందరికి బ్యాంకు ఖాతాలు లేవు. అలాంటి వారికి గ్రామాల్లో ఇబ్బంది లేకపోయినా.. పట్టణ ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎక్కడ సచివాలయంలో పింఛను పొందాలో కూడా తెలియడం లేదు. కొందరు తెలుసుకుని తెచ్చుకోగా... మరి కొందరు విషయం తెలియక నేటికీ పింఛను పొందలేకపోతున్నారు. సంబంధిత అధికారులు పింఛను నగదు అందజేసేలా చూడాలని చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

డయాలసిస్ సెంటర్ సందర్శన

ప్రజాశక్తి -కనిగిరి



రోగులతో మాట్లాడుతున్న అబ్దుల్ గఫార్

కనిగిరి ప్రభుత్వ వైద్యశాలలోని డయాలసిస్ సెంటర్‌ను మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ శుక్రవారం సందర్శించారు. డయాలసిస్ పేషెంట్లకు అక్కడ అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. డయాలసిస్ కేంద్రానికి వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా వైద్య సేవలు అందించాలని డయాలసిస్ సెంటర్ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా గఫార్ మాట్లాడుతూ పేదలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

పోలింగ్ తీరుపై వైసిపి అభ్యర్థి దద్దాల సమీక్ష

ప్రజాశక్తి- కనిగిరి

వైసిపి కనిగిరి నియోజక వర్గ అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ స్థానిక కారాలయంలో ఆ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భ:గా సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన ఓటింగ్ నమోదుపై అడిగి తెలుసుకున్నారు. వైసీపీకి వచ్చే మెజారిటీ పై చర్చించారు. వైసీపీ విజయానికి పాటుపడిన నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు గౌరవం ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిపి దంతులూరి ప్రకాశం, జడ్పిటి మడతల కస్తూరి రెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



వైసిపి నాయకులతో మాట్లాతున్న దద్దాల నారాయణ



పరిసరాలు శుభ్రం చేయిస్తున్న సర్పంచ్ అనూష రమేష్

డెంగీ నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-త్రిపురాంతకం: త్రిపురాంతకం మండలం దూపాడు గ్రామంలో సర్పంచ్ ఎనిబెర అనూష రమేష్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికుల చేత పరిసరాలు పరిశుభ్రం చేయించారు. డ్రైనేజీ కాలువలోని వ్యర్థాలను తొలగించారు. డిడిటి, ఎబెట్ పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎనిబెర అనూష రమేష్ మాట్లాడుతూ డెంగీ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. అనారోగ్యంపాలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, పారిశుధ్య కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులు

గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం వేసవి శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిక్షణా శిబిరాన్ని గత రెండు రోజుల నుంచి గ్రంథాలయంలో నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా 3వ రోజు విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చదివించటం, కథలు చెప్పించటం లాంటివి నిర్వహించారు. శిబిరానికి వచ్చిన విద్యార్థులు ఆనందంగా గడిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను సమ్మర్ క్యాంప్ కాస్లులకు పంపించి వారి అభివృద్ధికి సహకరించాలని గ్రంథపాలకుడు కే సత్యనారాయణ కోరారు.



వృద్ధాశ్రమానికి బియ్యం, పండ్లు అందిస్తున్న దృశ్యం

వృద్ధాశ్రమానికి సాయం పంపిణీ

ప్రజాశక్తి-కొమరోలు: కొమరోలులోని మెడిలైఫ్ మెడికల్ షాప్ యజమాని సందీప్ తన తల్లిదండ్రులు సంజీవయ్య రవణమ్మల జ్ఞాపకార్థం గిద్దలూరు పిఆర్ కాలనీ సంజీవని వృద్ధాశ్రమానికి, గిద్దలూరు రాచర్ల రోడ్డులోని మానసిక వికలాంగుల పాఠశాలకు 25 కేజీల బియ్యం, పండ్లు, గుడ్లు అందించారు. ఆశ్రమం చైర్మన్ రాజశేఖర్, మానసిక పాఠశాల చైర్మన్ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మానసిక వికలాంగుల పాఠశాల, వృద్ధాశ్రమాలకు సాయం చేసినందుకు సందీప్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా మెరుగైన సేవలు చేసే విధంగా వారు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శరత్‌బాబు, బాలచారి, ఓ రాజశేఖర్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పొగాకు కిలో అత్యధిక ధర రూ.308

ప్రజాశక్తి-సంతనూతలపాడు: మండలంలోని పేర్నమిట్ట పరిధిలోనున్న ఒంగోలు 1వ పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం గ్రామ రైతులు 1,485 బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వాటిలో 1,385 బేళ్లు కొనుగోళ్లు జరిగాయి. వివిధ కారణాలతో 100 బేళ్లను తిరస్కరించారు. కిలో అత్యధిక ధర రూ.308 పలుకగా అత్యల్ప ధర రూ.205 పలికింది. సరాసరి కిలో ధర రూ.269.95 పలికింది. వేలంలో 22 కంపెనీలు పాల్గొన్నాయి. వేలాన్ని వేలం కేంద్రం నిర్వహణాధికారి ఎం రవికాంత్ నిర్వహించారు.

బతుకుదెరువుకు వలసబాట

పనులు వెతుక్కుంటూ పట్టణాలకు.. ఊళ్లు వీడుతున్న చిన్న, సన్నకారు రైతులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వర్షాభావం రైతుల పాలిట శాపంగా మారింది. ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి, ఆముదం, మిర్చి, కంది, మినుము తదితర పంటలు వర్షాభావంతో దెబ్బతినడంతో దిగుబడిపై అన్నదాతలు ఆశలు వదులుకున్నారు. సాగు చేపట్టేందుకు చేసిన అప్పులు గుదిబండగా మారాయి. వాటిని తీర్చేందుకు మరో మార్గంలేదు. బతుకుదెరువుకు ఉపాధి పనులు ఉపకరిస్తాయనుకుంటే అవి కూడా నామమాత్రంగానే జరుగుతున్నాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో పేదలతో పాటు సన్న, చిన్నకారు రైతులు ఊళ్లు వదులుతున్నారు. చంటి బిడ్డలతో సహా మూట ముల్లె సర్దుకొని వలసబాట పడుతున్నారు. ఎన్నికలు ముగిసేంత వరకు గ్రామాల్లోనే గడిపారు. ఎన్నికలు ముగిశాక బతుకుదెరువు వెతుక్కుంటూ వలసబాట పడుతున్నారు.

నియోజకవర్గంలో వలసలు ఇలా..

ముఖ్యంగా యర్రగొండపాలెం నియోజరవర్గంలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు మండలాల నుంచి ప్రతియేటా 25 వేల మంది దాకా వలసబాట పడుతుంటారు. అయితే ఈ ఏడాది ఇప్పటికే సుమారు 30 వేల మంది దాకా వలసబాట పట్టారు. వారంతా ఈ నెల 13న జరిగిన సార్వత్రిక



ఓట్లు వేసి వలస వెళ్తున్న కూలీలు

ఎన్నికల్లో ఓటు వేసేందుకు నేతలు చార్జీలతో పాటు నజరానా ఇవ్వడంతో ఓట్లు వేసేందుకు సొంతూళ్లకు వచ్చారు. ఓట్లు వేయడం ముగియడంతో ఉపాధి పనులు దొరుకుతాయని చూశారు. అయితే అవి అరకొరగానే ఉన్నాయి. వ్యవసాయ సీజన్ ప్రారంభం కాలేదు. కనీసం వ్యవసాయంలో అరకొర పనులు కూడా జరగడం లేదు. వ్యవసాయ పనులు సాగాలంటే మరో 40 రోజుల నుంచి రెండు నెలలు దాకా పట్టే అవకాశం ఉంది. అప్పటిదాకా గ్రామాల్లో కనీసం కుటుంబాలను పోషించుకునేందుకు పనులు దొరకకపోవడంతో వలసబాట పడుతున్నారు. ప్రతిరోజూ ఒక్కో గ్రామం నుంచి 50 కుటుంబాల దాకా బతుకుదెరువు కోసం సుదూర ప్రాంతాల్లోని పట్టణాల్లో మట్టి పనులు, బేల్దారి పనులు, ఇండ్లలో ఇతర పనులు చేసేందుకు లారీల్లో తరలి వెళుతున్నారు.

ఉళ్లో ఉపాధి లేకనే వలసబాట..

ఊళ్లో ఉపాధి లేకనే వలసబాట పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు బాగా పండి దిగుబడి వస్తే ఇక్కడే పనులు ఉండేవని, చిన్న, సన్నకారు రైతులతో పాటు వ్యవసాయ కూలీలకు ఉపాధి దొరికేదని, పంటలు ఎండిపోవటంతో పైర్లను దున్నేసి మూగజీవాలకు మేతగా వదిలేసి వెళ్తున్నట్లు వారు పేర్కొన్నారు. రెండు నెలల పాటైనా వలస వెళ్లిన చోట పనులు దొరికితే కొంతమేర కుటుంబ ఖర్చులకైనా వస్తాయని, మరికొంత అప్పులు చెల్లించవచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువగా తెలంగాణ, మద్రాసు, పల్నాడు, బెంగుళూరు, విజయవాడ, గుంటూరు ప్రాంతాలకు మట్టి పనులు, చెరువు కోత, వ్యవసాయ పనులు, తాపీ పనులు చేసేందుకు వెళుతున్నామన్నారు. చంటి పిల్లలను సైతం వెంట తీసుకెళుతున్నామని తెలిపారు. తిరిగి వర్షాకాలంలో వ్యవసాయ పనులు ప్రారంభమై పనులు దొరికేదాకా దూర ప్రాంతాలలో పనులు చూసుకుంటూ జీవనం గడుపుకుంటామని పలువురు పేర్కొన్నారు. తాము ప్రతియేటా ఏడాదిలో ఎనిమిది నెలలు పాటు వలసతోనే జీవనం గడపాల్సి వస్తోందని చెప్పారు.

పిల్లా పాపలతో వెళ్తున్నాం
గుంటి సుబ్బయ్య, యర్రగొండపాలెం



పంట సాగుకు పెట్టిన పెట్టుబడి ఖర్చులకూ దక్కకపోవటంతో గ్రామంలో ఉండి ఏం ప్రయోజనం? కుటుంబం గడవని పరిస్థితి. పిల్లలతో కలిసి కుటుంబమంతా వలసబాట పట్టాల్సి వస్తోంది. రాబోయే రోజుల్లో మండలంలోని చాలా గ్రామాలు ఇదే బాట పట్టక తప్పేలా లేదు. ప్రభుత్వం రైతులను, వ్యవసాయ కూలీలను ఆదుకోవాలి.

అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలి
బొమ్మనబోయిన గురవయ్య, యర్రగొండపాలెం



మే నెల వచ్చినా ఇప్పటివరకు నియోజకవర్గంలో ఉపాధి పనులు ఊపందుకోలేదు. ఇటు వ్యవసాయ పనులు లేక, అటు ఉపాధి పనులు లేక జీవనం భారంగా మారింది. దీంతో గత ఏడాది కంటే ఈ ఏడాది ఎక్కువ మంది కూలీలు సన్న, చిన్నకారు రైతులు వలసబాట పడుతున్నారు. ప్రభుత్వం ఉపాధి పనులు కల్పించి ఆదుకోవాలి.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు: ఎస్ఐ

ప్రజాశక్తి-పుల్లలచెరువు

శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటుందని పుల్లలచెరువు ఎస్ఐ ఎండి ఫిరోజ్ ఫాతిమా అన్నారు.

శుక్రవారం ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు ప్రతి ఒక్కరూ సమన్వయం పాటించాలన్నారు. గొడవలు పెట్టుకోవడం, ఘర్షణలకు దిగడం సరికాదన్నారు. శాంతి



మాట్లాడుతున్న ఎస్ఐ ఫిరోజ్ ఫాతిమా

భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండల వ్యాప్తంగా బైండోవర్ కేసులు ఉన్న వారు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఎలాంటి గొడవలకు దిగవద్దని, ప్రధాన కూడళ్లలో సమావేశాలు నిర్వహించవద్దని సూచించారు. రాత్రి పూట హోటళ్ల వద్ద, పాన్ షాపుల వద్ద ఉండరాదని ఆదేశించారు. తమ ప్రవర్తన మార్చుకోవాలని సూచించారు. లేని పక్షంలో వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించేలా ప్రవర్తించినా, సమాజంలో ఉద్రిక్తతలను రేకెత్తించేలా ప్రవర్తించినా అట్టివారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భారంగా పశుపోషణ

- మేత కోసం అల్లాడుతున్న మూగజీవాలు
- ఇబ్బంది పడుతున్న కాపరులు

ప్రజాశక్తి-కొండపి

మేత, నీటి కోసం మూగజీవాలు తల్లడిల్లిపోతున్నాయి. వర్షం పడకపోవడంతో పచ్చిక భూములు కనపడకుండా పోయాయి. ఎండు, పచ్చిమేత దొరకడం లేదు. దీంతో పశువులు, గొర్రెలు, మేకలను పోషించడం కాపరులకు తీవ్ర భారంగా మారింది. వేల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన పశువులను నష్టాలకు అమ్ముకొంటున్నారు. ఇతర మండలాలకు, జిల్లాలకు వెళ్లి మేత కొనుగోలు చేసి తీసుకురావాలంటే అధిక ధరలతో పాటు రవాణా ఖర్చులు కూడా ఎక్కువ అవుతాయి. ఆ వ్యయాన్ని భరించలేక పశువులు, గొర్రెలను తక్కువ ధరలకే అమ్ముకుంటున్నారు. వర్షం పడకపోవడంతో ఎక్కడ చూసినా భూములు బీడుగా దర్శనమిస్తున్నాయి. గొర్రెలు, మేకలను మేత కోసం ఎక్కడికి తీసుకెళ్లాలో కాపరులకు అర్థం కావడం లేదు. ఎక్కడికి వెళ్లినా మేత, నీరు దొరకకపోడంతో మూగజీవాలు బక్కచిక్కిపోతున్నాయని కాపరులు వాపోతున్నారు. అధికారులు ఉపాధి హామీ పథకం కింద కొన్ని చోట్ల నీటి



ఎండిపోయిన దుక్కిలో ఏమీలేక మేతకోసం చూస్తున్న గొర్రెలు

తొట్లు ఏర్పాటు చేశారు. అవి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. సంవత్సరాల కాలంగా కాపాడుకుంటూ వస్తున్నాం. చూసిచూసి నష్టాలకు అమ్ముకోవాలంటే బాధేస్తోందని కాపరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడకుండా మరికొన్ని రోజులు ఇలాగే గడిస్తే వలసలు పోవాల్సి ఉంటుందని వాపోతున్నారు. రెండు రోజుల నుంచి వాతవరణం చల్లబడి మేఘాలు కనిపిస్తున్నా వర్షం కురవడంలేదు.

వలస వెళ్లాలి: గ్రామంలోని గొర్రెల కాపరులు

మేత, నీరు లేకపోవడంతో జీవాలు బక్కచిక్కిపోతున్నాయి. మరికొన్ని రోజులు వర్షం పడకపోతే ఊరు వదలి ఎక్కడికైనా వలస వెళ్లాలి. ఉన్న భూములు నీరు లేక బీడుగా మారాయి. జీవాలే మాకు జీవనోపాధి. అవి లేకుంటే మేం బతకలేం.

ఇంతటి కరువు ఎప్పుడూ లేదు: రావుళ్లపల్లి శ్రీను, గొర్రెలకాపరి



ఇంతటి దారుణమైన కరువు ఎప్పుడూ చూడలేదు. దగ్గరి భూముల్లో మేత, గడ్డి, దొరకడం లేదు. పొలాలలో ఉన్న చెట్ల దగ్గరకు వెళ్లి ఆకులు, అలుములు మేపుదామనుకుంటే చెట్లు మాడిపోతున్నాయి. జీవాలను ఎలా కాపాడుకోవాలో అర్థం కావడం లేదు.

రోడ్డుప్రమాదాల నియంత్రణకు చర్యలేవీ?

- మద్యం తాగి వాహనాలు నడపడం
- అతివేగంతో ప్రాణాలకు ముప్పు
- అద్దంకి, నార్కెట్‌పల్లి రోడ్డులో పెరిగిన ప్రమాదాలు
- ప్రమాదకరంగా చక్రాయపాలెం మూల మలుపు
- ప్రమాదాల నివారణకు చర్యలు నామమాత్రం

ప్రజాశక్తి - అద్దంకి

ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరిగాయి. మద్యం తాగి వాహనాలు నడపడం, అతివేగం ప్రమాదాలకు ప్రధాన కారణంగా కనిపిస్తున్నప్పటికీ చక్రాయపాలెం వద్ద జాతీయ రహదారి మలుపు మరింత ప్రమాదకరంగా మారింది. ఇటీవల వరుసగా వాహన ప్రమాదాలతో ప్రయాణం భయాన్ని కలిగిస్తుంది. ఈ నెలలోనే ఐదుగురు మృతిచెందారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఒక వాహన ప్రమాదం జరిగితే కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. అతివేగం ప్రమాదకరమని, మద్యం తాగి వాహనాలు నడపరాదని పోలీసులు, మోటార్ వెహికల్ అధికారులు హెచ్చరిస్తున్నప్పటికీ వాహనదారులు పెడచెవిన పెడుతున్నారు. రోడ్డుపై వేగంతో పోటీపడి వెళుతూ ప్రమాదాలకు గురవుతున్నారు.

పట్టణ ప్రాంతంలో పెరిగిన ప్రమాదాలు

పట్టణంలో ద్విచక్ర వాహన ప్రమాదాలు పెరుగుతున్నాయి. విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద, తిమ్మాయపాలెం, శంకరాపురం రోడ్డు ఇటుకల బట్టీల సమీపంలో ఇటీవల మూడు ప్రమాదాలు జరిగాయి. ఏకంగా బొద్దికూరపాడు గ్రామానికి చెందిన కుటుంబీకులు మొక్కులు తీర్చుకోవడానికి కోటప్పకొండకు ప్రైవేటు బస్సులో వస్తున్న సమయంలో తిమ్మాయపాలెం సమీపంలో బస్సు బాల్తో కొట్టిన ఘటనలో 20మందికి గాయాలు అయ్యాయి. చిన్న కొత్తపల్లి డొంక వద్ద ఈ నెలలోనే రెండు కార్లు ప్రమాదానికి గురయ్యాయి. ఆయా



ఇటీవల రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన కారు (ఫైల్‌ఫోటో)

కార్లలో ఉన్న ప్రయాణికులు గాయపడ్డారు. హైదరాబాదు నుండి నెల్లూరుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులు అద్దంకి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రోడ్డు మార్జిన్‌లోని ఇనుప గ్రిల్స్‌ను ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరు యువకులు అక్కడకక్కడే మృత్యువాత పడ్డారు. తిమ్మాయిపాలెం ఇటుకల బట్టీల సమీపంలో ముందు వెళు తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి సడన్ బ్రేక్ వేయడంతో టాటా మ్యాజిక్ వాహనం తిరగబడి ఒకరు మృతి చెందారు.

పట్టణంలో తీరని ట్రాఫిక్ సమస్య

వేగవంతమైన జీవన పరిణామంలో ప్రతి కుటుంబానికి ఒక వాహనం సమకూరింది. అధిక సంఖ్యలో ఒంగోలు వైపు నుండి లారీలు, కార్లు, బస్సులు హైదరాబాదుకు ప్రయాణం చేస్తున్నాయి. వాహనాల రద్దీ అయితే పెరిగింది. కానీ పెరిగిన వాహనాలు తిరిగేందుకు అనువైన పద్ధతిలో రడ్లు మాత్రం అభివృద్ధి జరగలేదు. దీంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమైంది. పట్టణంలోని రామ్ నగర్, బంగాళా రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, పోతురాజు గండి, భవాని సెంటర్ కూడలి, కలవకూరు రోడ్డు కూడలి ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య ఉండడంతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ అధిక వాహనాలు నడపడం ద్వారా గతంలో రోడ్డు దాటడానికి పెద్ద సమస్యలు లేవు. ఇటీవల కాలంలో రోడ్డు దాటడానికి ఐదు నుంచి పది నిమిషాలు కూడా సమయం పడుతుంది.

సెల్ మాట్లాడుతూ నడపడం ప్రమాదం

యువత, మహిళలుతో పాటు లారీ, బస్సు డ్రైవర్లు అధిక సంఖ్యలో సెల్ఫోన్ వంక చూస్తూ లేమ మాట్లాడుతూ వాహనాలు నడపడం సాధారణమైంది. దీనికి నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ఎదుటి వారి ప్రాణాలను బలిగొన్నే పరిస్థితి వస్తుంది. ఎదుటివారు కూడా అదే విధంగా సెల్ చూస్తూ వాహనాలు నడుపుతుంటే ప్రమాదాలు జరుగుతాయి. ఆర్టీసీ బస్సులు నడిపే వారు కూడా ఈ కోవలోనే ఉన్నారు. ప్రమాదంలో వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా అనేక ఒడిదుడుకులు అనుభవిస్తున్నారు. ప్రాణం పోతే తిరిగి రాదు. అటువంటిది యువత మితిమీరిన బైక్ రైడింగ్‌తో ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. కుటుంబీకులు, తల్లి, దండ్రుల ఆశలు ఆవిరవుతున్నాయి. రోడ్డుపై హెచ్చరిక బోర్డులు, నియమ నిబంధనల బోర్డులు తప్పనిసరిగా సంబంధిత అధికారులు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజా సంఘాల నాయకులు మన్నం త్రిమూర్తులు కోరారు.



ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన వారు (ఫైల్ ఫొటోస్)



పంగులూరు పిహెచ్‌సిలో బీపీ పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

బీపీ పట్ల జాగ్రత్త వహించాలి

ప్రజాశక్తి - పంగులూరు

అధిక రక్తపోటు పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, లేకుంటే అనేక అనర్థాలకు దారి తీసే అవకాశం ఉందని ఆరోగ్య ఉప కేంద్రం సిహెచ్ఓ జె పావని, ఎఎన్ఎం వి ఎస్తేరు రాణిలు చెప్పారు. ఎక్కువ కాలం పాటు రక్తపోటు పెరగడాన్ని అధిక బిపి అంటారని తెలిపారు. అధిక రక్తపోటు (హైపర్ టెన్షన్) డే సందర్భంగా ప్రజాశక్తి పంగులూరులోని పిహెచ్‌సిని సందర్శించింది. పావని, ఎస్తేరురాణి మాట్లాడుతూ ఒక్క క్షణం రుచి కోసం ఆహారంలో ఉప్పును ఎక్కువగా వాడటం వలన, ఉప్పటి పదార్థాలు ఎక్కువగా తీసుకోవటం వలన అధిక రక్తపోటు (బిపి) ఉన్నవారికి ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని తెలిపారు. అధిక రక్త పోటుకు సకాలంలో చికిత్స చేయించుకోకపోతే గుండె, మెదడు, మూత్ర పిండాలకు సమస్యగా మారే అవకాశం ఉందని అన్నారు. బీపీ సమస్య లేని వాళ్ళు కూడా 30ఏళ్ల వయసు దాటితే ఏడాదికి ఒకసారి బిపి చెక్ చేయించుకోవాలని సూచించారు. గుండె నొప్పి, స్ట్రోకు, తల తిరగటం, చాతి నొప్పి, అసౌకర్యంగా ఉండటం, అయోమయంగా ఉండటం, ముక్కు నుండి రక్తం కారటం, చూపు మందగించటం ఇవన్నీ అధిక రక్తపోటుకు ఉండే లక్షణాలని చెప్పారు. అధిక రక్తపోటు ఉందని నిర్ధారణ జరిగిన తర్వాత తప్పనిసరిగా అందుకు తగిన చికిత్స చేయించుకోవాలని చెప్పారు. మద్యపానం సేవించడం, సిగరెట్లు, బీడీలు, చుట్టలు తాగటం, మొదలైన వాటిని మానుకోవాలని, డాక్టర్ సలహా పాటించి అధిక రక్తపోటును అదుపులో ఉంచుకునేందుకు సరైన వైద్యం చేయించుకోవాలని కోరారు. అధిక రక్తపోటు దినోత్సవం సందర్భంగా చాలామందికి అధిక రక్తపోటు పరీక్షలు చేశామని తెలిపారు. మందులు ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు సిహెచ్ లక్ష్మీరాజ్యం, వై కనికరం పాల్గొన్నారు.



చిన్నారులతో లైబ్రేరియన్ బాదం విజయభాస్కరరెడ్డి

గ్రంథాలయంలో విజ్ఞాన తరగతులు

ప్రజాశక్తి- సంతమాగులూరు

స్థానిక శాఖ గ్రంథాలయంలో 3రోజులుగా విద్యార్థినీ, విద్యార్థులకు వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకుడు బాదం విజయ్ భాస్కరరెడ్డి తెలిపారు. శిబిరంలో విద్యార్థులకు ఆటపాటలతో పాటు రిటైర్డ్ లెక్చరర్ ఎండి అల్తాఫ్ చే స్పోకెన్ ఇంగ్లీష్ బోధిస్తున్నట్లు తెలిపారు. వేసవిలో విద్యార్థులు చెడు అలవాట్లకు, ప్రమాదాలకు గురికాకుండా వేసవి శిక్షణా తరగతులు ఎంతో స్ఫూర్తినిస్తాయని తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - నగరం

రేపల్లె 132కెవి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సాధారణ మరమ్మత్తుల నిమిత్తం నేడు ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు నగరం, నిజాంపట్నం మండలా ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందని డిఇ ఆర్ విజయ్ శ్రీనివాస్ తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.



నారాయణ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నిర్వాహకులు

సమాజ హితం 'నారాయణ' అభిమతం

ప్రజాశక్తి - బాపట్ల

సమాజ హితమే తమ అభిమానంగా జీవించిన నిస్వార్ధ సేవాపరుడు ఈఎల్ నారాయణ అని ఫోరం ఫర్ బెటర్ కార్యదర్శి పిసి సాయి బాబు అన్నారు. ఈఎల్ నారాయణ 23వ వర్ధంతి సందర్భంగా ఫోరం ఆధ్వర్యంలో టౌన్ హాల్లో నారాయణ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఊరి బాగు, నలుగురి క్షేమం గురించి నిరంతరం తపించిన వ్యక్తి ఈఎల్ అన్నారు. విజ్ఞాన సమితిని ప్రారంభించి సమాజంలో మూఢ నమ్మకాల నిర్మూలనకు కృషి చేశారని అన్నారు. విశ్వ భారతి నెలకొల్పి బాలల బంగారు భవిష్యత్తుకు పాటుపడ్డారన అన్నారు. వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించారని అన్నారు. ఫిలిం క్లబ్ ద్వారా అందరి మానసిక వికాసానికి దోహదపడ్డారని అన్నారు. కార్యక్రమంలో కె బ్రహ్మయ్య, న్యూస్ పేపర్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

ప్రజాశక్తి - అమర్తలూరు (చెరుకుపల్లి)

ఖరీఫ్‌కు సంబంధించి 50శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు ఇవ్వనున్నట్లు వ్యవసాయ అధికారి ఉయ్యూరు లోకేశ్వరి తెలిపారు. జనుము, జీలుగ ఒక్కొక్కటి రూ.88లకు గాను రూ.44 చొప్పున అందిస్తారని తెలిపారు. పిల్లి పెసర రూ.134లకు గాను రూ.67లకు అందజేస్తారని తెలిపారు. కావాల్సిన రైతులు సమాచారం అందజేస్తే పంపిణీ చేస్తామని తెలిపారు. ఈపాటికే అవసరమైన మేరకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. ఇంకా అదనంగా కావాలంటే ఆర్‌బికె కేంద్రాల్లో రైతులు సంప్రదించాలని కోరారు. జనము, జీలుగ విత్తనాలు 10కేజీల ప్యాకింగ్, పిల్లి పెసర 8కేజీల ప్యాకింగ్ లభ్యమవుతాయని తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు సద్విని యోగం చేసుకోవాలని కోరారు.

వర్షపు నీటితో ప్రయాణికుల పాట్లు

- చిన్నపాటి వర్షానికే నిలిచిపోతున్న వర్షపు నీళ్లు
- పట్టించుకోని పురపాలకులు



పాతబాస్టాండులో వర్షపు నీటిలో ఆగిన ఆర్టీసీ బస్సు

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణ ప్రధాన రహదారులు విస్తరించారు. రోడ్ల నిర్మాణానికి రూ.కోట్ల నిధులు ఖర్చు చేశారు. అయితే నీటి పారుదలకు అనువైన కాలువలు నిర్మించలేదు. ఏళ్ల తర బడి వర్షపు నీరు నిలుస్తున్న పాత బస్టాండు, అంబేద్కర్ సర్కిల్ మలుపు వద్ద చిన్న పాటి వర్షం కురిసినా చెరువును తలపిస్తుంది. రోడ్ల నిర్మాణ సమయంలోనైనా వర్షపు నీటిని తొలగించే మార్గాన్ని చూపుతారని ప్రజలు అనుకున్నారు. కానీ రోడ్ల నిర్మాణ ప్రణాళికలో అధికారులు నీటి పారుదల కల్పించలేదు. ఎన్నో ఏళ్లుగా ఈ సమస్య పట్టణాన్ని వెంటా డుతూనే ఉంది. రూ.58కోట్లు కేంద్ర ప్రభుత్వ నిధులతో పట్టణంలో జాతీయ రహదారిని విస్తరించారు. అయినప్ప టికీ నీటిపారుదల సమస్య మాత్రం యధాతథంగా కొనసాగుతూనే ఉంది. వర్షపు నీటికి తోడు జమ్ములపాలెం ఫ్లైఓవర్ పైనుంచి వచ్చి పడే వర్షం నీరు నిలిచిపోయి చెరువును తలపిస్తోంది. ఈ నీరు పోయే మార్గం లేక పాదాచారులు, వాహన చోదకులు అవస్థలు పడుతు న్నారు. పాత బస్టాండులో ప్రయాణికులు కూర్చునే షెడ్డు వద్దే వర్షపు నీరు నిలిచిపోతుంది. ఇక్కడ బస్సు ఎక్కాలన్నా, దిగాలన్నా ప్రయాణికులు నీటి కుంటలో దిగాల్సిందే. చేతిలో లగేజీ ఏదైె ఉంటే మాత్రం బస్సు ఎక్కాలన్నా, దిగా లన్నా వారి ఇబ్బంది వర్ణనాతీతం. వర్షానికి చుట్టుపక్కల మురుగనీరంతా బస్సులు ఆగే ప్రాంతానికి చేరుతోంది. మురుగునీటిలోనే పిల్లాపాపలతో ప్రయాణికులు మోకా ల్లోతు నీళ్లలో దిగి బస్సు ఎక్కాల్సి వస్తోంది. ఇది అనాదిగా కొనసాగుతూనే ఉంది. అయినా దీనిపై అధికారుల స్పం దన లేదు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చేపట్టి న పనుల్లోనైనా ఈ సమస్య పరిష్కారమౌ తుందని ఆశపడ్డ ప్రజలకు నిరాశ ఎదురైంది. రహదారి నిర్మాణ పనుల పట్ల కనీసం ప్రాథమిక అవగాహన లేని సిబ్బందిని ఈ పనుల కు వినియోగించడం వల్లే పరిస్థితి ఈ విధంగా దాపురిం చిందని ప్రజలు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కళ్లెదుటే సమస్య కనిపిస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టి పట్టినట్లు వ్యవహరిస్తున్నారు. పట్టణంలో జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డు ఇరువైపులా సైడ్ కాలువలు నిర్మిం చారు. అయితే రహదారి మార్గం అంచున నిలిచిన వర్షపు నీటిని ఆ కాలువల్లోకి మళ్ళించలేకపోతున్నారు. రోగికి శస్త్ర చికిత్స నిర్వహించి నాసికా రంధ్రాల్లో దూది ఉంచినట్లు ఇక్కడ రహదారి పనులు పూర్తయినప్పటికీ మురుగు కాలు వలను వినియోగించడంలో మునిసిపల్ అధికారులు విఫ లమయ్యారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. పురపాలక సంఘంలో సంబంధిత అధికారులకు దీనిపై కనీస అవగాహన లేకపోవడంతో కారణమని అంటున్నారు. వర్షం కురిస్తే పట్టణంలో వర్షంనీరు నిలుస్తున్న ప్రాంతాల ను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాల్సిన అధికారుల పర్యవేక్షణ పూర్తిగా లోపించింది. గతంలో అంబేద్కర్ బొమ్మ వద్ద నిలిచిన వర్షపు నీటిని పారిశుద్ధ్య సిబ్బంది తొల గించేవారు. సైడు కాల్వల నిర్మాణం జరిగినప్పటికీ ఆ నీటిని కాలువల్లోకి మళ్ళించకపోవడంతో సమస్య మరింత జటిలమవుతోంది. వర్షపు నీటితో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సైతం తమకేమీ తెలియనట్లు మునిసిపల్ అధికారులు వ్యవహరిస్తున్నారు. విస్తరణతో జిబిసి రోడ్డుపై వర్షపు నీరు నిలిచే సమస్య పరిష్కారం అవుతుందని ప్రజలు ఊహించారు. అందుకు భిన్నంగా సమస్య మరిం తగా పెరిగింది. దీనికి తోడు జీబీసీ రోడ్డులోనే అంతర్గ తంగా నిర్మించిన మంచినీటి పైపులు లీకు కావడం, ఆ నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆర్టీసీ బస్టాండు, అంబేద్కర్ సర్కిల్లో వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



స్ట్రాంగ్ రూంల వద్ద రిజిష్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

స్ట్రాంగ్ రూంల వద్ద

అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల వద్ద నిరంతరం అప్రమత్తంగా వుంటూ విధులు నిర్వహించాలని సిబ్బందికి కలెక్టర్ పి రంజిత్ భాషా సూచించారు. శుక్రవారం బాపట్ల ఇంజ నీరింగ్ కళాశాలలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను కలెక్టర్ పరిశీలించారు. స్ట్రాంగ్ రూంల వద్ద ఏర్పాటుచేసిన రిజిష్టరులో సంతకం చేసిన కలెక్టర్, జిల్లా ఎస్ పి వకుల్ జిందాల్‌తో కలిసి జిల్లా లోని అన్ని నియోజక వర్గాల స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. కౌంటింగ్‌కు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధుల కోసం ఏర్పాటు చేసిన గ్యాలరీ, బ్యారికేడ్ల ఏర్పాటు తదితర పనులను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట అడిషనల్ ఎస్ పి విఠలేశ్వర్, డి ఆర్ ఓ సత్తిబాబు, బాపట్ల ఆర్ డి ఓ రవీందర్, రేపల్లె ఆర్‌డిఓ హెలా షారోన్ తదితరులు ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న కిమ్స్ వైద్యులు

'కిమ్స్'లో అరుదైన 'టావి' చికిత్స

- మెట్రో నగరాల తర్వాత ఇలాంటి చికిత్స ఇక్కడే..
- కిమ్స్ వైద్యుల వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు

ఒంగోలు కిమ్స్ హాస్పిటల్‌లో శుక్రవారం నాడు కార్డియాలజీ విభాగంలో టావి అనే అరుదైన శస్త్రచికిత్స జరిగింది. అరుదైన చికిత్స చేయటం తమ వైద్యశాలకు ఎంతో గర్వకారణమని ఈ సందర్భంగా వైద్యులు వెల్లడించారు. హాస్పిటల్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. హైదరాబాద్, విశాఖపట్నం మెట్రోనగరాల తర్వాత 3వ నగరం మన ఒంగోలు, కిమ్స్ హాస్పిటల్‌లో టావి చికిత్స చేశారు. 67 సంవత్సరాలు వెంకట్రావు అనే వ్యక్తి తీవ్రమైన ఎరోటిక్ స్టెనోసిస్తో బాధపడుతూ కిమ్స్ హాస్పిటల్‌కి వచ్చి కార్డియాలజిస్ట్ డా.ఓరుగంటి హరీష్‌ని సంప్రదించారు. సాధారణంగా ఇలాంటి వ్యాధులకు ఓపెన్ హార్ట్ సర్జరీ ఏవియర్ అను పెద్ద ఆపరేషన్ చేయవలసి ఉంటుంది. కానీ ఈ పేషెంట్‌కి గతంలో బైపాస్ సర్జరీ జరగడం వల్ల ఏవిఆర్ ఆపరేషన్ సాధ్యపడదు. ఒంగోలు కిమ్స్ హాస్పిటల్లో అధునాతన పరికరాలు ఆధునిక పరిజ్ఞానం అందుబాటులో ఉండటం వల్ల టావి అనే శస్త్ర చికిత్స చేశారు. డా.ఓరుగంటి హరీష్ మరియు కార్డియాలజీ వైద్య బృందం ఆపరేషన్ లేకుండా ఈ విధానాన్ని విజయవంతం చేసింది. రోగి త్వరగా కోలుకుని రెండో రోజు నుండి ఆరోగ్యంతో మెరుగుపడి డిశ్చార్జ్ అయ్యారు. ఈ శస్త్ర చికిత్స విజయవంతం చేసినందుకు డా.ఓరుగంటి హరీష్, కార్డియాలజీ వైద్య విభాగాన్ని కిమ్స్ హాస్పిటల్ డాక్టర్లు అందరూ అభినందించారు. ఈ సందర్భంగా డా. ఓరుగంటి హరీష్ మాట్లాడుతూ టావి శస్త్ర చికిత్స చేయడం ద్వారా రోగి పూర్తి ఆరోగ్యంతో డిశ్చార్జ్ అవ్వడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. రోగి కుటుంబసభ్యులు మాట్లాడుతూ డా.హరీష్‌కి, ఇతర వైద్య బందానికి కతజ్ఞతలు తెలిపారు. ఎక్సిక్యూటివ్ డైరెక్టర్ టి.గిరి మాట్లాడుతూ మెట్రోనగరాలకే పరిమితమైన ఇటువంటి క్లిష్ట సర్జరీలను మన ఒంగోలు కిమ్స్ హాస్పిటల్‌లో నిర్వహించటం ఎంతో అభినందనీయమన్నారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ చికిత్సలో పాల్గొన్న డా.ఓరుగంటి హరీష్‌ని, కార్డియాలజీ వైద్య బందాన్ని మరియు టెక్నీషియన్లని అభినందించారు. అత్యాధునిక వైద్య సేవలు ప్రకాశం జిల్లా వాసులకి ఎప్పటికప్పుడూ అందుబాటులోకి తీసుకుని రావడానికి సహకరించిన కిమ్స్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ బొల్లినేని భాస్కర రావుని, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.గిరి నాయుడుకి, మెడికల్ సూపరింటెండెంట్ డా. టి శ్రీహరిరెడ్డి , జనరల్ మేనేజర్- మార్కెటింగ్ అమర్నాథ్ తదితరులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆధునిక వైద్య చికిత్స అందించడంలో తమ వైద్యశాల ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని ఈ సందర్భంగా వారు తెలిపారు.

కూటమి అధికారంలోకి రావటం ఖాయం

- 20 వేల మెజార్టీతో గెలుస్తున్నాం
- క్లస్టర్ ఇన్‌ఛార్జిల సమావేశంలో దామచర్ల జనార్ధనరావు వెల్లడి



మాట్లాడుతున్న దామచర్ల జనార్ధన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో టిడిపి-బిజెపి-జనసేన కూటమి అధికారంలోకి రావటం ఖాయమని, 20 వేల మెజార్టీతో గెలుస్తున్నట్లు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు అసెంబ్లీ అభ్యర్ధి దామచర్ల జనార్ధనరావు తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో దామచర్ల జనార్ధనరావు క్లస్టర్ ఇన్‌ఛార్జిలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా వ్యవహరించిన క్లస్టర్ ఇన్‌చార్జిలు, ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో వారు నిర్వహించిన పాత్రపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలలో కూటమి నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేశారన్నారు. ప్రధానంగా తెలుగుదేశం పార్టీలోని బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జిలు సమర్ధవంతంగా పనిచేశారన్నారు. పోలింగ్ రోజు వైసిపి నుంచి బెదిరింపులు వచ్చినా ఏజెంట్లు వాటిని తిప్పికొట్టారన్నారు. వైసిపి అక్రమాలకు పాల్పడినా ప్రజలు తెలుగుదేశం పార్టీ వైపు మొగ్గు చూపారన్నారు. ఎన్నికలలో క్లస్టర్ ఇన్‌చార్జిలు చేసిన కృషి ఫలితంగా కొత్తపట్నంలో 1500, ఒంగోలు మండలంలో 2500, ఒంగోలు నగరంలో 16000 మొత్తం 20 వేల మెజార్టీ కూటమికి వస్తుందన్నారు. ఎన్నికలలో కష్టపడి పనిచేసిన క్లస్టర్ ఇన్‌చార్జిలకు దామచర్ల జనార్ధనరావు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మంత్రి శ్రీనివాసరావు, కామేపల్లి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు కొఠారి నాగేశ్వరరావు, పఠాన్ హనీఫ్‌ఖాన్, పాలూరి వెంకటేశ్వర్ రెడ్డి, జాజుల కృష్ణ, బండారు మదన్ పాల్గొన్నారు.

కలేకూరి ప్రసాద్‌కి ఘన నివాళి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కలేకూరి సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత కలేకూరి ప్రసాద్‌కు ఘన నివాళులు అర్పించారు. ఒంగోలు ప్రెస్ క్లబ్‌లో కలేకూరి 11వ వర్ధంతి సభ జరిగింది. సమాజానికి కలేకూరి ప్రసాద్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమం లో డప్పు కళాకారుల,చర్మకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జంగ్రాజుపల్లి ఆంజనేయులు, దళిత సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు చప్పిడి వెంగళరావు, దళిత కళామండలి రాష్ట్ర అధ్యక్షులు చిట్టిమాల సంపత్ కుమార్, తంగిరాల సోని, నూకతోటి రవి, చప్పిడి కోటేశ్వరరావు పాల్గొన్నారు.



కలేకూరి ప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

చేనేతలకు శిక్షణ ఎప్పుడో.?

- నేతన్నలకు అందుబాటులోకి రాని కామన్ ఫెసిలిటీ సెంటర్లు
- ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని నిర్మాణాలు



దేశాయిపేటలో నిరుపయోగంగా ఉన్న కామన్ ఫెసిలిటీ సెంటర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

వస్త్ర ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా చేనేత కార్మికులకు తగిన శిక్షణ ఇచ్చి వారిలో నైపుణ్యాన్ని పెంచి ఉపాధి అవకాశాలను పెంచడం కోసం కేంద్ర ప్రభుత్వం కామన్ ఫెసిలిటీ సెంటర్ల (చేనేత శిక్షణ కేంద్రాలు) నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. చేనేత కార్మికులు అధిక సంఖ్యలో ఉన్న ప్రాంతాల్లో ఈ కేంద్రాలను నెలకొల్పి, శిక్షణకు కావాల్సిన పరికరాలు ఏర్పాటుచేసి బందాల వారీగా చేనేత కార్మికులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. చేనేతలకు మంచి ఉపాధి అవకాశాలతో పాటు చేనేత రంగాన్ని ఆదుకోవాలన్న సదుద్దేశంతో జిల్లాలో 16 కామన్ ఫెసిలిటేట్ సెంటర్ల నిర్మాణానికి నాలుగేళ్ల క్రితం శ్రీకారం చుట్టారు. చేనేత కార్మికుల నైపుణ్యాభివృద్ధి కోసం మంజూరు అయిన కామన్ ఫెసిలిటీ సెంటర్లు ఏళ్లు గడుస్తున్నా నేతన్నలకు అందుబాటులోకి రావడం లేదు. చేనేత రంగంలో వస్తున్న మార్పులు, మారుతున్న ప్రజల అభిరుచులకు అనుగుణంగా నైపుణ్యంతో కూడుకున్న నాణ్యమైన చేనేత వస్త్రాలను రూపొందించడమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేనేత క్లస్టర్ వ్యవస్థ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న సామెతగా ఉండిపోయింది.

జిల్లాలో చేనేత వృత్తిపై జీవిస్తున్న వారి నైపుణ్యాభివృద్ధి కోసం ముందుగా 12 కామన్ ఫెసిలిటీ సెంటర్ల నిర్మాణానికి మొదటగా రూ.3 కోట్లు 76 లక్షలు నిధులు మంజూరయ్యాయి. చీరాల ప్రాంతంలోని ఈపురుపాలెం, తోటవారిపాలెం, దేశాయిపేట, చేనేతపురి, వేటపాలెంలలో 9 కేంద్రాల నిర్మాణాలు ప్రారంభించారు. అలాగే జిల్లాలోని కొత్తపట్నం, బేస్తవారిపేట మండలాల్లో ఒక్కొక్క సెంటర్, మార్టూరు మండలం కొండమంజులూరులో మరొక సెంటర్‌ను మంజూరు చేశారు. ఇవి కాకుండా చేనేతలు ఉన్న మరో 4 చోట్ల కేంద్రాల నిర్మాణాలు జరగాల్సి ఉంది. ఒక్కొక్క కామన్ ఫెసిలిటీ సెంటర్‌ను 3 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించాలని ముందుగా నిర్ణయించారు. కానీ తగినంత స్థలం లభించని చోట జిప్లస్ తరహాలో నిర్మాణాలు ప్రారంభించారు. ఒక్కొక్క సెంటర్ కోసం రూ.50 లక్షల నిధులను ఖర్చు చేశారు. ఇందుకోసం జిల్లాలో 700 మంది వరకు చేనేతలు ఉన్న ప్రాంతాన్ని క్లస్టర్‌గా చేశారు. రూ.31.50 లక్షల వ్యయంలో షెడ్ నిర్మాణం, మిగతా నిధులతో నేత పరికరాలు, మగ్గాలు, ఇతర యంత్రాలు, సౌకర్యాల కల్పనకు ఖర్చు చేయాల్సి ఉంది. ఈ కేంద్రాలు అందుబాటులోకి వస్తే అక్కడ మగ్గాలు ఏర్పాటు చేసి నైపుణ్యంతో సులువుగా పని చేసుకునేందుకు అవసరమైన యంత్ర పరికరాలు అందుబాటులోకి తెస్తారు. ఆధునిక నేత పద్ధతులు, రంగుల అద్దకం, కంప్యూటర్ డిజైన్‌లలో శిక్షణ ఇచ్చి వృత్తి నైపుణ్యాన్ని అందజేయాల్సి ఉంది. కరోనా కల్లోలం కారణంగా స్థలాల ఎంపికల్లో జరిగిన జాప్యం వల్ల కామన్ ఫెసిలిటీ సెంటర్ల నిర్మాణాల్లో జాప్యం జరిగింది. 9 సెంటర్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈ కేంద్రాల్లో మౌళిక సదుపాయాలు కల్పించి ప్రారంభించాల్సి ఉంది. వేటపాలెం, కొండమంజులూరు, చీరాల, రామకృష్ణాపురం, పందిళ్లపల్లి, రామన్నపేటల్లో కామన్ ఫెసిలిటీ సెంటర్ల నిర్మాణాలు జరగాల్సి ఉంది. పూర్తయిన చేనేత శిక్షణా కేంద్రాలను వినియోగంలోకి తేనందున భవనాల చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోతున్నాయి. శిక్షణ పరికరాలు, శిక్షణ కోసం నిధులు విడుదలయితే లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన చేనేత శిక్షణా కేంద్రాలు చేనేతలకు అందుబాటులోకి వస్తాయి.